# ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 20.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 300 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఆర్సీబీ జోరు.. ప్లే ఆఫ్స్ చేరు 10



# మేడారం కొత్తశోభ

## అట్టహాసంగా గద్దెలు, ఆలయ ప్రాంగణం పునఃప్రారంభం

- ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి
- ఆలయం చుట్టూ ఆకట్టుకుంటున్న గిరిజన శిల్పాలు
- ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేలా అత్యద్భుతంగా పునర్నిర్మాణం
- భక్తులకు అంకితం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం, మేడారం

**జనవరి 19 :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన మేడారం మహా జాతరను సోమవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సహచరుల మధ్య లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి మేడారంలో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోమవారం తెల్లవారక ముందే ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పునర్నిర్మాణం చేసిన ఆలయంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ పున:నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గ సహచరుల మధ్య భక్తులకు అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. దాదాపు వెయ్యేళ్ల వీరగాథకు, జాతి వారసత్వ సంపదకు సంబంధించిన చరిత్రకు అద్దం పట్టేలా రూపుదిద్దుకున్న మేడారం గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని పునః ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు.

**తాళపత్ర గ్రంథాలకు శిల్ప రూపం**

ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం దిద్దుకుంది. చారిత్రక కట్టడాల తరహాలో

...:: మిగతా 2లో

# కవిత, ప్రశాంత్ కిషోర్ భేటీ

## జాగృతి పార్టీకి పీకే వ్యూహాల ముద్ర




- పార్టీ నిర్మాణం , రాజకీయ కార్యాచరణపై చర్చ
- అస్తిత్వ పరిరక్షణ ఎజెండాతో కొత్త రాజకీయ పార్టీ
- త్వరలో భారీ సభ, పార్టీ ప్రకటించే అవకాశం

చిటుకుల మైసారెడ్డి

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** హైదరాబాద్ రాజకీయ వేదిక మరోసారి వేడెక్కింది. దేశ రాజకీయాల్లో ఎన్నికల వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ (పీకే) మళ్లీ తెలంగాణపై ఫోకస్ పెట్టారా? అంటే అవుననే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ప్రశాంత్ కిషోర్ ఇటీవల వారం వ్యవధిలో రెండు సార్లు హైదరాబాద్‌లో భేటీ కావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ అలజడి మొదలైంది. కొద్ది రోజులుగా నిశ్శబ్దంగా సాగుతున్న రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించిన అంశం.. దేశ రాజకీయాల్లో ఎన్నికల వ్యూహకర్తగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ తిరిగి తెలంగాణపై దృష్టి పెట్టడమే. అంతకుమించి సంచలనంగా మారింది తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆయన భేటీ. ఇటీవల వారం వ్యవధిలోనే రెండు సార్లు హైదరాబాద్‌లో ప్రశాంత్ కిషోర్‌ను కవిత కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ భేటీలు సాధారణ మర్యాదపూర్వక సమావేశాలు కాదని, తెలంగాణ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జరిగిన లోతైన చర్చలని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కవిత ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్న వేళ ఈ భేటీ జరగడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అధికార మార్పులకు కీలకంగా పనిచేసిన 'టీం పీకే' ఇప్పుడు తెలంగాణకు తిరిగి రావడం వెనుక స్పష్టమైన రాజకీయ లక్ష్యమే ఉందన్న

...:: మిగతా 2లో

# నేడో, రేపో మున్సిపోల్ షెడ్యూల్!




## 26,27 తేదీల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం

## ఫిబ్రవరి 14న కొత్త పాలకవర్గాల ఏర్పాటు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, జనవరి 19:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఫిబ్రవరిలో రెండో వారంలోగా ఎన్నికలను ముగించాలని నిర్ణయించింది. అదే నెల 14వ తేదీలోగా కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పదవీకాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో 2,996 వార్డులు, డివిజన్లలో ఎన్నికలు జరుపాలని నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్

...:: మిగతా 2లో


# స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

- కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఏలేటి
- పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు
- వచ్చే నెల 6కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, జనవరి 19:** సుప్రీంకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయలేదని పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను కౌశిక్ రెడ్డి, కేటీఆర్ పిటిషన్లతో జత చేసిన సుప్రీంకోర్టు అన్ని పిటిషన్లపై విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది. తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక

...:: మిగతా 2లో



# బొగ్గు కుంభకోణం నుండి దృష్టి మళ్లించేందుకే

- హరీష్ రావుపై కక్ష సాధింపు
- రేవంత్ రెడ్డి 'డైవర్షన్ పాలిటిక్స్'ను వదిలేదే లేదు!
- సుప్రీంకోర్టు కొట్టేసినా కేసుతో మళ్లీ డ్రామా
- బావమరిది సుజన్ రెడ్డి స్కామ్ బయటపడటంతో రేవంత్ లో వణుకు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జనవరి 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి సంబంధించిన బొగ్గు కుంభకోణం బయటపడటంతోనే, దాని నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హరీష్‌రావు కు ఫోన్ ట్యాపింగ్ అంశంలో నోటీసులు ఇచ్చి 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు మండిపడ్డారు. రాజకీయ వేధింపులే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య మాత్రమేనని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తేల్చి చెప్పిందని

...:: మిగతా 2లో





# సింగరేణి టెండర్లలో భారీ స్కాం

- సీఎం–మంత్రుల వాటాల పంచాయతీ
- సైట్ విజిట్ పేరుతో సింగరేణిలో దోపిడీ
- సింగరేణిలో కాంగ్రెస్ అవినీతి బట్టబయలు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- సీబీఐ విచారణకు డిమాండ్
- నైనీ బ్లాక్ రద్దుతోనే కథ ముగియదు
- అన్ని సింగరేణి టెండర్లు రద్దు చేయాలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జనవరి 19:** సింగరేణి టెండర్లలో కుంభకోణం, ముఖ్యమంత్రి, మంత్రుల వాటాల పంచాయతీల అంశాలు వెలుగులోకి వచ్చాయని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు చెప్పారు. భట్టి వెల్లడించినట్లుగా, కాంట్రాక్టు సైట్ విజిట్ పద్ధతి నైనీ బ్లాక్‌లో పెట్టడం వల్ల నైనీ బ్లాక్ టెండర్లు రద్దు చేయవలసి వచ్చింది. అయితే ఈ విధానం మన రాష్ట్రంలోనే కాదు, దేశంలో కూడా లేనిదని, వెస్టన్ కోల్ ఫీల్డ్ మరియు కోల్ ఇండియాలో కూడా ఇది రాయలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024లో సైట్ విజిట్ విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానం వచ్చిన తరువాత మొదటి లబ్దిదారులు రేవంత్ బామ్మర్ది సుజన్ రెడ్డి గారి కంపెనీ శోదా కన్స్ట్రక్షన్ అవగా, ఈ కంపెనీకి టెండర్ మొదట వచ్చింది. సైట్ విజిట్ విధానం వలన సింగరేణిలో ఆరు టెండర్లు కూడా వారి అనుయాయులకు ప్లస్ 7 శాతం కంటే ఎక్కువ రేటులో కట్టబెట్టడం జరిగింది. భట్టి వివరించినట్టుగా, గతంలో ఎన్ ఓబీ కోల్ బ్లాక్ టెండర్లు మైనస్ 10 నుంచి మైనస్ 22 శాతం రేట్లో వెళ్ళేవి. కానీ రేవంత్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ టెండర్లు అన్ని ప్లస్ 7 నుంచి ప్లస్ 10 శాతం రేటులో కట్టబెట్టడం జరిగిందని తెలిపారు. సైట్ విజిట్

...:: మిగతా 2లో



# రాబందులను దరిదాపుల్లోకి రానివ్వం

- మహిళా సంఘాలకు రూ.5,000 కోట్ల వడ్డీ లేని రుణాలు
- రైతులు, పేదల కోసం 1.21 లక్షలకు కోట్లు వెచ్చించాం
- ఇందిరమ్మ ఇల్లు వేగంగా నిర్మించుకోండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం

**జనవరి 19:** రాష్ట్రంలో సంపదను పెంచుతాం, పంచుతాం.. గద్దలు, డేగలు .. రాబందులను దరిదాపుల్లోకి రానివ్వమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దేందుకు ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలోని మహిళా సంఘాల సభ్యులకు రూ. 5,000 కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్టు తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మొదటి సంవత్సరం 20,000 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తాం అంటే ఆనాడు హేళన చేశారు, కానీ మేం లక్ష్యాన్ని మించి 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లులు త్వరగా పూర్తి చేసుకోండి ప్రతి వారం బిల్లులు మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎన్నికల ముందు పీపుల్స్ మార్చ్

...:: మిగతా 2లో



### బీజేపీ తీరుపై రాహుల్ ధ్వజం..

ఆర్ఎస్ఎస్, బీజేపీపై మళ్లీ విమర్శలు చేశారు రాహుల్ గాంధీ . దేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కేరళలోని కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

9



### ఉన్నావ్ కేసులో హైకోర్టు కీలక తీర్పు

2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది.

9



### కాబూల్ హోటల్‌లో పేలుడు..

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక హోటల్‌లో బాంబు పేలుడు జరిగింది. ఈ సంఘటనలో ఏడుగురు మరణించారు. చాలా మంది గాయపడినట్లు తాలిబన్ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది.

9



### స్పెయిన్ రైలు ప్రమాదంలో 39 మృతులు

దక్షిణ స్పెయిన్‌లోని అడముజ్ వద్ద దుర్ఘటన జరిగింది. మాడ్రిడ్‌కు వెళ్తున్న ఓ రైలు పట్టాలు తప్పి, మరో మార్గానికి చెందిన పట్టాలపై పడిపోయింది. దీంతో ఆ ట్రాక్‌పై వస్తున్న ఓ రైలును ఢీకొట్టింది.

9

# రాబందులను దరిదాపుల్లోకి రానివ్వం

మొదటిపేజీ తరువాయి

పాదయాత్రలో భాగంగా. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు యాత్ర చేపట్టగా ప్రతి చోట మాకు ఇల్లు ఇప్పించండి ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పదేళ్లు పరిపాలించిన వారు ఇల్లు ఇవ్వలేదు మేం అధికారంలోకి రాగానే ఒక్కొక్కరికి ఐదు లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పాము చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇల్లు 22,500 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులు, పేదల సంక్షేమం కోసం మూడు లక్షల కోట్ల బడ్జెట్లో 1,21, 874 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రం మనది ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల కోసం 74,163 కోట్లు నేరుగా రైతులకు పంపిణీ చేస్తున్నాం, ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు పేద వర్గాల సంక్షేమం కోసం చేపట్టి 47,710 కోట్లు నేరుగా రైతులు, పేదల చేతికి ప్రజా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాం ఇ 0దుకుగాను ప్రభుత్వం ఇప్పటివరకు మహిళల పక్షాన ఆర్టీసీకి ₹7,000 కోట్లు చెల్లించిందని తెలిపారు. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన చీరలు పొలాల్లో దిష్టిబొమ్మలకు కట్టేందుకు కూడా పనికిరావు కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రతి ఆడబిడ్డ ఇంటికి నాణ్యమైన చీరను బొట్టు పెట్టి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం కిలో ధర 55 రూపాయలు పలుకుతుండగా ఒక్కో మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. మన బిడ్డలు ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రవ్యాప్తంగా 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు.

**ఖమ్మం జిల్లాలో అదనంగా 1.98 లక్షల ఎకరాలకు సాగునీరు.**

కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలోనే ఖమ్మం జిల్లాలో 2.79 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేశాయి అన్నారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఖమ్మం జిల్లాలో 1.98 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మున్నేరు పాలేరు లింకు ద్వారా 1.38 లక్షల ఎకరాలకు, నెహ్రూ ఎత్తిపోతల పథకం కింద 33,025 ఎకరాలకు, రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2500 ఎకరాలకు, మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా 2,412 ఎకరాలకు సాగునీరు అందించబోతున్నామని తెలిపారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల మీదుగా పారుతున్న నదులు, ఏరుల నీరు వృధాగా పోకుండా అడ్డుకట్టలు వేసి పొలాలకు నీళ్లు పారిస్తున్నాం అన్నారు. ఎర్రుపాలెం మండలంలో కట్టలేరు, మధిర బోనకల్లు మధ్య వైరా నదిపై, చింతకాని ముదిగొండ మధ్య మున్నేరు నదిపై ఆనకట్టలు నిర్మించామని తెలిపారు. కక్షలు కార్పన్యాలతో రగిలిపోయి.. ఎండిన బీడు భూములతో కూడిన ఈ ప్రాంతంలో జల సిరులు పారి రైతులు కంకులు ఏరుతుంటే, వడ్లు పండిస్తుంటే చూసి తన గుండె నిండా సంతృప్తి మిగిలిందని తెలిపారు.

# మేడారం కొత్తశోభ

మొదటిపేజీ తరువాయి



అద్భుత కట్టడం ఆవిష్కృతమైంది. సమ్మక్కసారలమ్మ మహాజాతర నిర్మాణ పనులు చరిత్రలోనే ఓ మైలు రాయిగా నిలిచిపోయేలా సర్కార్ చేపట్టింది. రాతిశిలలతో అభివృద్ధి పనులకు ప్రాణం పోయగా, 4 వేల టన్నుల గ్రానైట్‌పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసేలా 7 వేల చిత్రాలను హృద్యంగా చిత్రీకరించారు. సెప్టెంబర్ 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా మూడు నెలల వ్యవధిలోనే పనులను పూర్తి చేశారు. సమ్మక్క సారలమ్మ చరిత్ర, పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను కళ్లకు కట్టినట్టుగా నిర్మాణాలు చేపట్టారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ చరిత్రను కళ్లకు కట్టే విధంగా వందల ఏళ్లు చెక్కు చెదరకుండా పనులు పూర్తి చేశారు.

**46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో**

గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకార నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం, వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలు చెక్కారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు అబ్బురపరుస్తున్నాయి. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల చిత్రాలను ఏర్పాటు చేశారు.

**ఘనంగా సీఎంకు వీడ్కోలు..**

గత రెండు రోజులు మేడారంలో చేసిన శాశ్వత అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్ సహచర మంత్రులు పర్యవేక్షించారు. అనంతరం రాష్ట్ర చరిత్రలో మొదటిగా కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ పున:నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గ సహచరుల మధ్య భక్తులకు అంకితం చేశారు. సోమవారం ఉదయం తిరిగి హైదరాబాద్ కు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రివర్గ సహచరులు, అధికారులు, సమ్మక్, సారలమ్మదేవాలయ పూజారులుఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భం గామంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభంతో ఒక కట్ట ముగిసిందని సీతక్క తెలిపారు. బుధవారం నాడు మండే మెలిగే పండుగ ఉందన్నారు. మండే మెలిగే పండుగ నుంచి నిండు పండగ వరకు ఇదే రకంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తల్లుల కీర్తిని ప్రపంచానికి చాటేలా కవరేజ్ చేసిన మీడియా సోదరులందరికీ సీతక్క ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మేడారంలో క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన అధికారులందరికీ అభినందనలు తెలిపారు.

**ఆడవిలో కేబినెట్ భేటీ...**

హైదరాబాదులో జరిగే క్యాబినెట్ సమావేశాన్ని అడవిలోకి తీసుకొచ్చి ఏర్పాట్లు చేశామని, కేవలం కేబినెట్ సమావేశమే కాదు రాత్రి సీఎం కుటుంబం, మంత్రుల కుటుంబాలు ఇక్కడ బసచేశాయని తెలిపారు. రెండు రోజులపాటు ఇక్కడ యావత్ క్యాబినెట్ ఉండడం, క్యాబినెట్ సమావేశాన్ని ఇక్కడే ఏర్పాటు చేసి పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రకటించడం ములుగుకు గర్వకారణం అపకపానెజ క్యాబినెట్ సమావేశాన్ని సక్సెస్ చేసిన అధికార యంత్రంగా అందరికీ అభినందనలు అటెండర్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు, హోంగార్డుల నుండి డీజీపీ వరకు.. కష్టపడి పనిచేసి క్యాబినెట్ సమావేశాన్ని, సీఎం పర్యటనను విజయవంతం చేసిన అందరికీ పేరు పేరునా సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రులకు 'మున్సిపల్' పరీక్ష

- జిల్లాలకు ఇంచార్జీలుగా మంత్రులు
- తాజా పరిణామాల వేళ రేవంత్ నిర్ణయం

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** రాష్ట్రంలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారాయి. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల వేళ రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మీడియా సంస్థల కేంద్రంగా మంత్రులు లక్ష్యంగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై రేవంత్ సీరియస్ గా తీసుకున్నారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రాజకీయంగా బిగ్ టాస్క్ ఎదుర్కొనేందుకు సిద్దమయ్యారు. ఇందులో మంత్రులను భాగస్వాములను చేస్తున్నారు. మంత్రుల సమర్థతకు పరీక్ష పెడుతూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ పరీక్ష మంత్రుల రాజకీయ భవిష్యత్ కు కీలకంగా మారుతోంది. ఆదివారం మంత్రి వర్గ భేటీ రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు నిర్ణయించారు. ఫిబ్రవరిలో ఈ ఎన్నికలు జరపాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని 116 మునిసిపాలిటీలు, ఏడు మునిసిపల్ కార్పొరేషన్లు, 2,996 వార్డు సభ్యుల పదవీకాలం పూర్తయినందున.. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. డెడికేషన్ కమిషన్ ఇప్పటికే నివేదిక ఇచ్చిందని, దాని ఆధారంగా రెండు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఫిబ్రవరి 15న శివరాత్రి, ఆ మరుసటి రోజు రంజాన్ పండుగ, తదనంతరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నందున.. వీలైనంత తొందరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. కాగా, మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు అధికార కాంగ్రెస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ మంత్రుల సమర్థతకు పరీక్ష పెడుతూ కీలక నిర్ణయం వెల్లడించారు

**జిల్లాలకు వీరే బాధ్యులు**

మున్సిపల్ ఎన్నికల వేళ మంత్రులను పార్లమెంటరీ జిల్లాల వారీగా ఇంచార్జ్ బాధ్యతలను కేటాయించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ సీటు గెలవాల్సిందేనని సీఎం తేల్చి చెబుతున్నారు. హైకమాండ్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో.. మంత్రులకు కేటాయించిన జిల్లాల్లో ఫలితాలే వారి మంత్రి పదవి కొనసాగింపుకు కొలమానంగా సంకేతాలు ఇచ్చారు. ఆదిలాబాద్ సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మల్కాజ్‌గిరి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చేవెళ్ల శ్రీధర్‌బాబు, మెదక్ వివేక్, కరీంనగర్ తుమ్మల నాగేశ్వరరావు, పెద్దపల్లి జూపల్లి కృష్ణారావు, నల్గొండ అడ్లూరి లక్ష్మణ్, భువనగిరి సీతక్క, వరంగల్ పొంగులేటి, మహబూబ్‌నగర్ పొన్నం ప్రభాకర్, మహబూబ్‌నగర్ రాజనర్సింహా, జహీరాబాద్ అజహరుద్దీన్, నాగర్‌కర్నూల్ వాకిటి శ్రీహరి, ఖమ్మం కొండా సురేఖకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉండటం, ఈ ఫలితాలు తమ మంత్రి పదవికి పరీక్షగా మారటంతో మంత్రుల్లో ఉత్కంఠ మొదలైంది. దీంతో.. మున్సిపల్ ఎన్నికలు కేంద్రంగా చోటు చేసుకొనే పరిణామాలపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# నేడో, రేపో మున్సిపోల్ షెడ్యూల్!

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల నిర్వహణకు మంగళవారం లేదా బుధవారాల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నది. ఇదేనెల 26,27 తేదీల్లో నోటిఫికేషన్ విడుదలకానున్నది. ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. 29 వరకు నామినేషన్ల స్వీకరణ, 30న పరిశీలన, తిరస్కరణ, 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబవరి ఒకటి అభ్యంతరాల పరిష్కారం, 2న నామినేషన్ ఉపసంహరణ గడువు, ఫిబ్రవరి 3 నుంచి వారంపాటు ప్రచారానికి అవకాశం కల్పించే అవకాశం ఉన్నది. ఫిబ్రవరి 11 లేదా 12 తేదీల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఏదో ఒకరోజు ఒకేసారి పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 14న కొత్త పాలక వర్గాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.

# స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, తర్వాత మరో 4 వారాల సమయాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయ నిపుణులు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది శాసన సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతి ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు.

**ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్**

మొదటగా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండోసారి మరో ఇద్దరికి క్లీన్‌చిట్ ఇచ్చిన ఆయన మరో ఎమ్మెల్యేకు సంబంధించి తీర్పు రిజర్వులో ఉంచారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై ఇంకా విచారణ పూర్తి కాలేదు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు చెందిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగాల్సి ఉంది.

**అనర్హత పిటిషన్లు కొట్టేసిన స్పీకర్**

నోటీసులు ఇచ్చిన తర్వాత నెలల సమయం తీసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌కు తన సమాధానాన్ని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దీంతో నోటీసులు స్వీకరించిన వారిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరే సమాధానం ఇవ్వనట్లుగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన సంగతి తెలిసిందే. పదో షెడ్యూల్‌లోని పేరా 6 ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ పార్టీ మార్పు కారణంగా అనర్హత నియమాలు 1986 ఆధారంగా స్పీకర్ ఈ తీర్పునిచ్చారు.

# బొగ్గు కుంభకోణం నుండి దృష్టి మళ్లించేందుకే

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ గుర్తు చేశారు. అత్యున్నత న్యాయస్థానమే ఆ కేసును కొట్టేసి, ఈ పొలిటికల్ డ్రామాకు తెరదించినా.. మళ్లీ ఇప్పుడు మాజీ మంత్రి హరీష్ రావు కు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోందని ఆయన విమర్శించారు. అసలు ఈ నోటీసుల వెనుక ఉన్న కారణం ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సూదిని సృజన్ రెడ్డికి అడ్డగోలుగా జరిగిన బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని తాము సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టామని, ఈ భారీ స్కామ్ నుండి తప్పించుకోవడానికే రాత్రికి రాత్రే హరీష్ రావుకు నోటీసులు పంపారని కేటీఆర్ ఆరోపించారు. ఇది పక్కాగా రేవంత్ రెడ్డి మార్క్ 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఎద్దేవా చేశారు. అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి ప్రతిపక్ష నేతలపై బురద చల్లడం, నోటీసులతో బెదిరించడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావు తెలంగాణ ఉద్యమం నాటి నుండి నేటి వరకు నిరంతరం ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని, అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని కేటీఆర్ అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, పాతపడిపోయిన కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే ఈ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తమకు చట్టం పైన, న్యాయస్థానాల పైన పూర్తి గౌరవం ఉందని తెలిపారు. ఏ విచారణకైనా తాము సిద్ధమని స్పష్టం చేస్తూనే.. నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూడటం భ్రమ మాత్రమేనని హెచ్చరించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల పక్షాన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వేటాడటం ఆపేది లేదని, కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.


# సింగరేణి టెండర్లలో భారీ స్కాం

మొదటిపేజీ తరువాయి

విధానం ద్వారా ఎవరు ముందుగానే టెండర్ వేస్తున్నారో తెలుసుకొని, బలవంతపడి, వారికి టెండర్ దక్కకుండా చేసి తమ అనుయాయులకు టెండర్లు కట్టడం జరుగుతుందని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ బ్లాక్‌లో ఇదే పరిస్థితి జరిగిందని పేర్కొన్నారు. అయితే, గతంలో సింగరేణిలో ఉన్న బీఆర్ఎస్ సమయంలో ఇచ్చిన టెండర్లను రద్దు చేసి, వాటిని తమ అనుయాయులకు కట్టబెట్టడమే ఇదే విధానం అని అన్నారు. ఉదాహరణగా, వెంకటేషన్ కని అనే మైనస్ 7 టెండర్ బీఆర్ఎస్ హయాంలో ఉన్నప్పుడు, ఇప్పుడు అదే టెండర్ ప్లస్ 7 శాతంతో రీటెండర్ చేసి అప్పగించబడిందని చెప్పారు. అలాగే, ఎస్ ఆర్ పీ ఎసీ టూ శ్రీరాంపూర్ టెండర్ రద్దు చేసి, ప్లస్ 7 శాతంతో అప్పగించడం జరిగింది. సింగరేణి గతంలో డీజిల్‌ను కూడా కాంట్రాక్టర్లకు అప్పగించేవారు, కానీ డీజిల్ విధానం రద్దు చేయడం వల్ల సంస్థకు నష్టం కలిగిందని భట్టి గారు చెప్పారు. ప్రధానంగా, ముఖ్యమంత్రి దగ్గరి సన్నిహితులు మరియు సమీప బంధువుల చలనాల్లో టెండర్లు, సర్టిఫికెట్లను కట్టడం జరుగుతుందని, ఎవరికీ సర్టిఫికేట్ లేదా టెండర్ రావాలంటే వారి ఆదేశం తప్పనిసరిగా ఉండాల్సిందని వెల్లడించారు. భట్టి సీబీఐ విచారణకు అన్ని వివరాలను అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి, రేవంత్ రెడ్డి, బీజేపీ అక్రమ సంబంధాలు లేవని, చీకటి ఒప్పందాలు లేవని నిర్ధారించడానికి సీబీఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్క సైట్ విజిట్ విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని, డీజిల్ విధానాన్ని రద్దు చేయాలని, సింగరేణికి సీనియర్ అర్హత కలిగిన సీఎండీని నియమించాలని, నైనీ బ్లాక్ టెండర్లను మాత్రమే కాకుండా, ఆరు టెండర్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సినిమా, హాలో గ్రాం, దేవాదాయ శాఖల టెండర్లలో జరిగిన అవినీతి, ముఖ్యమంత్రి సన్నిహితుల మధ్య తగలికలు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఎరువుల కొరత వంటి ముఖ్య అంశాలపై చర్చలు జరిగినా, రైతు, విద్యార్థుల సమస్యలు పట్టించుకోలేదని హరీశ్ రావు అన్నారు. భట్టి స్పష్టం చేసినట్లుగా, సింగరేణి టెండర్లతో సంబంధమున్న అన్ని కేసులపై సీబీఐ విచారణ జరగాలని, అవినీతిని బయట పెడతామని చెప్పారు.

# రాజకీయ యాత్ర కాదు.. దేవుడి మొక్కు మాత్రమే

- షాద్ నగర్ నుంచి బండ్ల గణేష్ సంకల్ప యాత్ర షురూ!



**ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 19:** ప్రముఖ తెలుగు సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ 'సంకల్ప యాత్ర' పేరిట తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని తన సినిమా థియేటర్ నుంచి సోమవారం ఉదయం ఈ యాత్ర ప్రారంభమైంది. సుమారు 500 కిలోమీటర్ల మేర గణేష్ యాత్ర సాగనుంది. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఇది రాజకీయ యాత్ర కాదని.. దేవుడి మొక్కు మాత్రమే అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అభిమానంతో నడిచి వెళ్తున్నానని.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశీస్సులతో ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. తాను మెగాస్టార్‌ను చూద్దామని సినీ ఇండస్ట్రీకి వచ్చానని.. అలాంటి చిరంజీవి సినిమా తన థియేటర్‌లో ఆడుతుండగా సంకల్ప యాత్ర మొదలు పెట్టినట్లు బండ్ల గణేష్ చెప్పారు. నాడు చంద్రబాబు అరెస్ట్ తనను ఎంతో బాధించిందని తెలిపారు. ఆయనకు బెయిల్ వస్తుందని, కోర్టు విచారణ ఉన్న ప్రతిసారీ సుప్రీంకోర్టులో ఉండేవాడినని గుర్తుచేశారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన ఎలాంటి మచ్చలేకుండా విడుదల కావాలని ఏడుకొండల వాడికి మొక్కుకున్నానన్నారు. తాజాగా చంద్రబాబు ఆ కేసు నుంచి ఆధార రహితంగా తేలి, జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ అధికారంలోకి రావడంతో ఆ మొక్కు తీర్చుకుంటున్నారు. ఇది పూర్తిగా భక్తి భావంతో చేస్తున్న యాత్ర అని, రాజకీయ యాత్ర కాదని బండ్ల గణేష్ స్పష్టం చేశారు.

# కవిత, ప్రశాంత్ కిషోర్ భేటీ

మొదటిపేజీ తరువాయి

అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో కాంగ్రెస్, బీజేపీ, టీఎంసీ, వైసీపీ వంటి పార్టీలకు ఎన్నికల వ్యూహాలు అందించి విజయాల్లో భాగస్వామ్యమైన ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ప్రయత్నంలో ఉన్నారా అన్న చర్చ మొదలైంది.

**సుధీర్ఘ చర్చ**

ఈ భేటీలో కవిత-ప్రశాంత్ కిషోర్ మధ్య ప్రధానంగా చర్చకు వచ్చిన అంశం కొత్త పార్టీ నిర్మాణం. పార్టీ నిర్మాణం ఎలా ఉండాలి, ప్రజల్లో విశ్వాసం కలిగించే రాజకీయ కార్యాచరణ ఎలా రూపొందించాలి, ప్రస్తుత రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు భిన్నంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే పార్టీగా జాగృతి ఎలా ఎదగాలి అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణలో బలమైన సామాజిక వర్గాలైన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, మహిళలు, యువత, రైతులు వంటి వర్గాలను ఎలా సమీకరించాలి, వారి సమస్యలను రాజకీయ అజెండాగా ఎలా మలచాలి అన్నదానిపై పీకే తన అనుభవంతో కూడిన సూచనలు ఇచ్చినట్లు తెలిసింది. రానున్న సాధారణ ఎన్నికల నాటికి జాగృతి పార్టీని ఒక ఉద్యమంగా మాత్రమే కాకుండా, ప్రధాన రాజకీయ శక్తిగా ప్రజల ముందుకు తీసుకురావాలన్నదే కవిత లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణం, క్యాడర్ డెవలప్‌మెంట్, సోషల్ ఇంజినీరింగ్, రాజకీయ కమ్యూనికేషన్ వంటి అంశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మొత్తం ప్రక్రియలో ప్రశాంత్ కిషోర్ తనదైన మార్క్‌తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది ప్రశాంత్ కిషోర్ కవిత పార్టీతో కలిసి నడిచేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారన్న సమాచారం. పూర్తి స్థాయిలో జాగృతి పార్టీకి వ్యూహాత్మక మద్దతు అందిస్తానని, తెలంగాణ వ్యాప్తంగా 'టీం పీకే' పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ భేటీల్లో భవిష్యత్ కార్యాచరణపై ఒక అవగాహన ఒప్పందం కూడా కుదిరినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేకపోయినా, రాజకీయ సంకేతాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. బలమైన ప్రాంతీయ భావోద్వేగాలు, సామాజిక సమీకరణలు, రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న ఓ వర్గం తెలంగాణలో ఉందన్న అంచనాతోనే పీకే ఈ దిశగా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. మరోవైపు, కవిత కూడా తన రాజకీయ ప్రస్థానాన్ని కొత్త మలుపు తిప్పే ప్రయత్నంలో ఉన్న నేపథ్యంలో ఈ కాంబినేషన్ తెలంగాణ రాజకీయాలకు కొత్త సవాల్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. తెలంగాణ రాజకీయాలు ఇక పాత ఫార్ములాలతో ముందుకు సాగబోవడం లేదు. 'టీం పీకే' ఎంట్రీతో రాజకీయ వేడి మరింత పెరగడం ఖాయమనే మాట ఇప్పుడు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

**కవిత రాజకీయ పార్టీ అన్ని ఏర్పాట్లు పూర్తి**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. అస్తిత్వ పరిరక్షణ ఎజెండాతో రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీని ప్రకటించేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత సిద్ధమవుతున్నట్లు సమాచారం. పార్టీ ఏర్పాటుకు సంబంధించిన అన్ని ప్రక్రియలు దాదాపు పూర్తయ్యాయని, అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని వివిధ వర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను సేకరించేందుకు మొత్తం 50 అధ్యయన కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ కమిటీలు రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు తదితర వర్గాల సమస్యలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికలను అందజేస్తున్నాయి. అదే సమయంలో పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ఒక కొలిక్కి తీసుకొచ్చినట్లు సమాచారం. పార్టీ బైలా, జెండా రంగులు, ఎన్నికల గుర్తు వంటి అంశాలు ఇప్పటికే ఖరారయ్యాయని పార్టీకి సమీప వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ అస్తిత్వం, స్వాభిమాన పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ పార్టీ ముందుకు సాగనుందని ప్రచారం జరుగుతోంది. త్వరలోనే హైదరాబాద్ లేదా సిద్దిపేట/ యాదగిరిగుట్ట వేదికగా భారీ సభ నిర్వహించి పార్టీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జాగృతి కమిటీల సమావేశం**

తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత స్థితిగతులు, సమగ్రాభివృద్ధి, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలు, రాష్ట్ర వనరుల సమర్థ వినియోగంపై అధ్యయనం కోసం తెలంగాణ జాగృతి ఏర్పాటు చేసిన 50 కమిటీల సభ్యులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తమ తమ అధ్యయన అంశాలను వివరించి, ప్రాథమిక నివేదికలను ఆమెకు సమర్పించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి అవసరమైన బ్లూ ప్రింట్ రూపొందించే దిశగా తెలంగాణ జాగృతి కృషి చేస్తోందని ఈ సమావేశంలో వెల్లడైంది. అలాగే ప్రజాభిప్రాయం మేరకు భవిష్యత్తులో రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని వివిధ కమిటీల సభ్యులు తమ నివేదికల్లో సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రజల సమస్యలకు స్థిరమైన పరిష్కారాలు చూపే లక్ష్యంతో తెలంగాణ జాగృతి ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నేను రెండేండ్ల క్రితమే ఆడటం ఆపేశాను. నా ఇష్టంతోనే ఈ ఆటలోకి వచ్చాను. ఇష్టపూర్వకంగాఏనే తప్పకున్నాను. దీనిని ప్రత్యేకంగా అనౌన్స్ చేయాల్సిన అవసరం లేదు.

- సైనా నెహ్వాల్, భారత స్టార్ షట్లర్

రాజకీయం

# బీసీ రిజర్వేషన్లపై ఎందుకు చర్చించలేదు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం
- బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలి
- బీజేపీ, బీఆర్ ఎస్ ఎందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం లేదు
- మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయాలి
- లేకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం
- బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తాం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** మేడారంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై కనీసం చర్చించలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్చించకుండా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్వహించడం బీసీలను మరోసారి దగా చేయడమేనని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఫైర్ అయ్యారు. నేడు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాదులోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆందోళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఇక ఎన్నికలైనా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్పష్టంగా హామీ ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయించడం అంటే బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు, ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు. మెస్సి ఆట కోసం హైదరాబాదుకు వచ్చిన రాహుల్ గాంధీ బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్న హైదరాబాద్‌కు వచ్చి ఎందుకు స్పందించడం లేదన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేస్తుంటే రాహుల్ గాంధీ కళ్లుమూసు కుంటున్నారా? అని ఆయన ప్రశ్నించారు. చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు,లేదంటే కాంగ్రెస్‌ను బీసీలు ఇక జన్మలో నమ్మరని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇక ముగిసిన అధ్యాయంగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల 42 శాతం సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెండు రోజుల్లోనే జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జేఏసీ కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం,మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్, సంధ్యారాణి, సిద్ధాంతం శ్యామల, శైలజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, రాజేశ్వరి,వెంకటేష్, శ్రీనివాసాచారి, గజ్జల సత్యం గౌడ్, జే. వెంకటయ్య,జే. వెంకటమ్మ, నర్సమ్మ, అంజమ్మ, బీవీ, అలవేల, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధికి మరో ముందడుగు

- కొత్త చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి కోసం 7 కోట్ల 49 లక్షలు మంజూరు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రతిపక్షం, హుస్నాబాద్ , జనవరి 19:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులకు మరో కీలక ముందడుగు పడింది. హుస్నాబాద్ కొత్త చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం ఇరిగేషన్ శాఖ రూ.7.49 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అడ్డుకట్టతో పాటు నీటిపారుదల కాలువల పునరుద్ధరణ పనులకు రూ.2.74 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు లభించాయి. ఈ రెండు చెరువుల అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించడంపై హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల పునరుద్ధరణతో సాగునీటి వసతులు మెరుగుపడి రైతులకు మేలు చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. కొత్త చెరువు అభివృద్ధికి రూ.7.49 కోట్లు, ఎల్లమ్మ చెరువు కాలువల పునరుద్ధరణకు రూ.2.74 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.




# ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవని 19:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమిషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 విన్నపాలు, ఫిర్యాదులు అందాయి. జీహెచ్ ఎంసీ పరిధిలోని 12 జోన్లలో మొత్తం 168 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, అలివేలు మంగతాయారు, పంకజ, యుబీడీడి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ రజినీకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, అడిషనల్ సీసీపీ ప్రదీప్ పాల్గొన్నారు.

# పెట్టుబడులే లక్ష్యంగా సీఎం దావోస్ పర్యటన

- ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి దావోస్ వెళ్లిన సీఎం
- సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 19 :** తెలంగాణాలో పెట్టుబడులను ఆకర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం మరో మారు దావోస్ పర్యటనకు బయలు దేరింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి దావోస్ పర్యటనకు వెళ్లారు. జనవరి 20 నుంచి నాలుగు రోజులపాటు దావోస్‌లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కంపెనీల సీఈఓలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు.దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేల్స్‌ఫోర్స్, యూనిలీవర్, హనీవెల్, ఎల్ఓరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డీపి వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో సీఎం విడివిడిగా భేటీ అవుతారు. పలు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు.తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఐటీ, ఏఐ, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరుపుతారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ను, రాష్ట్రం లో వివిధ రంగాల అభివృద్ధి కి ఉన్న అనుకూలతలను దావోస్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ పర్యటన ద్వారా తెలంగాణను ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, అధికారుల బృందం దావోస్ పర్యటనకు వెళ్లారు.

# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు వేలం

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** నగరంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా తొర్రూర్ , కుర్మల్ గుడ, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్ పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చెంది మౌలిక వసతులతో ఉన్న ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం తెలిపారు. ఆయా ప్రాంతాలను బట్టి బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే చదరపు గజానికి రూ. 20 వేల నుంచి 30 వేల వరకు అప్ సెట్ ప్రైస్ తో ఈ ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.swagruha.telangana.gov.in వెబ్ సైట్ లో చూడవచ్చని వివరించారు. ఫోన్ నెంబర్లు 8121022230 (తొర్రూర్), 8347472106 (బహదూర్ పల్లి),7993455802 (కుర్మల్ గుడ) లలో సంప్రదించవచ్చు.

# పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై విచారణ వాయిదా

- ఫిబ్రవరి 20లోపు లిఖితపూర్వకమైన సబ్మిషన్ ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశం

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** కాళేశ్వరం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె జోషి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కేసీఆర్, హరీష్ రావ్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం వాదనలు వినిపించారు.ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లై ఫైల్ చేశారు. రిప్లైకు ప్రభుత్వం రిటన్ సబ్మిషన్ ఇచ్చేందుకు సమయం కావాలని హైకోర్టును అడ్వకేట్ జనరల్ కోరారు. ఫిబ్రవరి 20లోపు లిఖితపూర్వకమైన సబ్మిషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.




# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించాలి

- సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం షురూ
- చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** జిల్లాలోని గ్రామ పంచాయితీలలో అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగించాలని సర్పంచ్లకు చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. సోమవారం జిల్లాలోని శంషాబాద్ మండలం ముచింతల్ స్వర్ణ భారతి ట్రస్ట్ లో నూతన సర్పంచ్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణా రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ పంచాయతి వ్యవస్థను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్ లదే అని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని తెలిపారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్ధవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ పద్మజా, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, పద్మజా రాణి , డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# తెలంగాణ మహిళల సమస్యలపై నివేదిక

- స్టీరింగ్ కమిటీ అందజేసిన తెలంగాణ జాగృతి మహిళా కమిటీ

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** తెలంగాణ రాష్ట్రంలోని మహిళల సమస్యలు, వివిధ జిల్లాలకు చెందిన మహిళలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను గత పది రోజులుగా విస్తృతంగా అధ్యయనం చేసిన తెలంగాణ జాగృతి మహిళా కమిటీ తమ అధ్యయన నివేదికను సోమవారం తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ సభ్యులకు అందజేసింది. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ సభ్యులైన రూప్ సింగ్ , ఇస్మాయిల్, రవిచంద్ర, వరలక్ష్మి లకు మహిళా కమిటీ డాక్యుమెంట్‌ను అధికారికంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి స్టేట్ సెక్రటరీ భవాని వేములతో పాటు మహిళా కమిటీ సభ్యులు కుసుమ రాజిత, రేణుక యాదవ్ పాల్గొన్నారు. మహిళలపై ప్రభావం చూపుతున్న సామాజిక, ఆర్థిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచినట్లు వారు తెలిపారు. మహిళల హక్కుల సాధన కోసం తెలంగాణ జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని, మహిళల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందని నేతలు పేర్కొన్నారు.

# నేడు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 19 :** నేడు కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేధికలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కావున కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




# గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి

**ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 19 :** నాగిరెడ్డిగూడ గ్రామ అభివృద్ధిలో గ్రామస్థులను భాగస్వాములుగా చేస్తూ... గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ కిసరి పద్మ సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో అండర్ గ్రౌండ్ వాటర్ సంపు దగ్గర ఉన్న ఇనుపకంచెను తొలగించి ఫ్రీ కాస్ట్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... గ్రామాన్ని సమస్యలు లేని గ్రామంగా తీర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె అన్నారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జైపాల్ , మాజీ ఎంపిటిసి అర్జున్, హేమలత, వనజ, యాదగిరి, రాజు, నిరోష, విజయరాజ్, మధుకర్, రోజా, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక కుక్క కరుస్తోందని వందల కుక్కలను చంపడమేంటి?

- మైనర్‌ను హత్యాచారం చేశారని వారిని హత్య చేస్తున్నామా?
- వీధి కుక్కలపై సుప్రీంకోర్టు తీర్పు.. స్పందించిన రేణూ దేశాయ్




**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 19:** దేశంలో వీధి కుక్కల సమస్యకు కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రముఖ సినీ నటి, జంతు ప్రేమికురాలు రేణూ దేశాయ్ కోరారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి హైదరాబాద్ మహానగరంలో వీధి కుక్కలను చంపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కల అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్పందించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ దర్శకుడు టిక్కా శశికిరణ్, యాంకర్ రష్మి గౌతంతో కలిసి మాట్లాడారు.

అత్యాచారాలపై ఎందుకు స్పందించరు? : సాధారణంగా సమాజంలో కుక్క మనిషిని కరవడం తప్పేనని, ఆ ఒక్క మూగజీవి కోసం మిగతా కుక్కలను ఎందుకు బలిచేయాలి? అంటూ రేణూ దేశాయ్ ప్రశ్నించారు. వంద కుక్కలు ఉంటే అందులో 5 కుక్కలు మాత్రమే మనుషులను కరిస్తే మిగతా 95 కుక్కలను కూడా చంపేస్తున్నారని మండిపడ్డారు. ఆ విధానం సరికాదని స్పష్టం చేశారు. మనిషిని కుక్క కరిస్తే స్పందించే వ్యవస్థలు, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు, డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల బారిన పడి సంభవించే మరణాలు, హెల్మెంట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవడం, చిన్నారుల జరుగుతున్న అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదు? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. పాలన వ్యవస్థలు పూర్తిగా విఫలం కావడం వల్లే కుక్కల్లో దూకుడు స్వభావం పెరుగుతోందని యాంకర్ రష్మీ ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలకు ప్రత్యేక షెల్టర్లు, వసతులు కల్పిస్తే సమస్య చాలా వరకు తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. తక్షణమే వీధి కుక్కల నివారణ కోసం ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలతో పాటు యాంటీ రేబిస్ వాక్సిన్లు వేసి షెల్టర్లలో పెట్టి సంరక్షించాలని సినీ దర్శకుడు శశికిరణ్ టిక్కా ప్రభుత్వాన్ని కోరారు.



'అనగనగా ఒక రాజు' మూవీ రూ.100 కోట్ల మార్క్ అందుకోవడం చాలా సంతోషకరమైన విషయం. ముంబైలో పాల్గొన్న ఎన్నో ఆడిషన్స్, సినిమాని వదిలేయాలనుకున్న క్షణాలు గుర్తొచ్చాయి. యాక్సిడెంట్ తర్వాత నటించగలనా అని ప్రతిరోజూ ఏడ్చే వాడిని. ఈ సక్సెస్ ఎన్నో ఏళ్ల తన పోరాటానికి ఫలితం. నాపై నమ్మకం ఉంచిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ విజయం మన అందరిది

-హీరో నవీన్ పొలిశెట్టి

ఓపెన్ వాయిస్

# రూపాయి బలహీనత వెనుక వ్యూహం

భారత రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతోంది. ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఒక డాలర్‌తో పోలిస్తే రూ.90 మార్కును దాటింది. దీంతో దేశంలో ద్రవ్యోల్బణం భయాలు పెరిగాయి. సామాన్యుడిపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. కానీ ఈ పతనం వెనుక ఆర్బీఐ ఒక గొప్ప వ్యూహాత్మక ప్రణాళిక దాగి ఉంది. అమెరికా భారీ టారిఫ్‌లను ఎదుర్కోవడానికి దేశీయ ఆర్థిక వృద్ధిని కాపాడటానికి మానిటరీ పాలసీని రూపాయిని ఆయుధంగా మార్చారు.రూపాయి 90కి చేరడం కేవలం పతనం కాదు, ఆర్థిక పోరాటంలో భాగమే. అమెరికా ట్రంప్ పరిపాలన భారత దిగుమతులపై 25-60% టారిఫ్‌లు విధించడంతో దేశీయ పరిశ్రమలు ఒత్తిడిలో పడ్డాయి. దీంతో ఆర్బీఐ రేట్ కట్‌లు, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచి రూపాయి విలువను కొంత బలహీనపరచడం ద్వారా ఎగుమతులకు పోటీశక్తి పెంచింది. దీంతో టెక్స్‌టైల్స్, ఫార్మా, ఐటీ రంగాలు ప్రయోజనం పొందాయి.అమెరికా భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచడంతో దిగుమతుల ఖర్చు రూ.50 వేల కోట్లు పెరిగింది. రూపాయి 85 నుంచి 90కి చేరడంతో భారత ఎగుమతులు 8-10% పోటీశక్తి పొందాయి. ఎంఎస్ఎంఈలు, చిన్న పరిశ్రమలు అమెరికా మార్కెట్‌లో ధరల పోటీలో ముందుకు వచ్చాయి. ఆర్బీఐ ఫారిన్ ఎక్స్ఛేంజ్ రిజర్వులను 650 బిలియన్ డాలర్లకు చేర్చి మార్కెట్ స్థిరత్వం కాపాడిందిఆర్బీఐ రెపో రేట్‌ను 6.25%కి తగ్గించి రుణాల ఖర్చును తగ్గించింది. ద్రవ్యోల్బణం 4.5%లో ఉంచి ఆర్థిక వృద్ధిని 7%కి చేర్చారు. రూపాయి బలహీనత వల్ల ఇంపోర్టెడ్ ఇన్‌ఫ్లేషన్ పెరిగినా, దేశీయ ఉత్పత్తులపై ఆధారపడటం పెరిగింది. పీఎల్ఐ స్కీమ్‌లు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలు ఈ వ్యూహానికి మద్దతుగా నిలిచాయి. రూపాయి వ్యూహం వల్ల భారత్ యూరోప్, ఆఫ్రికా మార్కెట్‌ల వైపు మళ్లింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావం 40%కి తగ్గింది. పీఎల్ఐ స్కీమ్‌ల కింద మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 25% పెరిగాయి. 2026 చివరిలో రూపాయి 88-89 పరిధిలో స్థిరపడి జీడీపీ 7.5% వృద్ధి సాధిస్తుందని అంచనా.భారత్ పెట్రోల్, ఫోన్లు, యంత్రాలు వంటి చాలా వస్తువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇవి ఎగుమతుల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. డాలర్ ప్రపంచంలోనే పెద్ద కరెన్సీ. కాబట్టి అన్ని దిగుమతులకు డాలర్‌లోనే డీల్ ఉంటుంది. రూపాయి తగ్గితే, దిగుమతి ధర పెరుగుతుంది. దీన్ని 'ఇంపోర్టెడ్ ఇన్‌ఫ్లేషన్' అంటారు. దీని వల్ల ధరలు పెరిగి ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావం పడుతుంది. ముఖ్యంగా 5 పెద్ద కంపెనీలకు లాభం ఉంటుంది. ఐటీ కంపెనీలు రూపాయి తగ్గడం వల్ల మంచి లాభం పొందతాయి. ఎందుకంటే వాళ్ల ఆదాయం ఎక్కువగా డాలర్‌లోనే వస్తుంది. ఇన్ఫోసిస్‌కి అమెరికా నుంచి 22 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుంది. కంపెనీ మొత్తం ఆదాయంలో ఇదే 60 శాతం ఉంటుంది. అయితే క్లయింట్లకు కొంచెం డిస్కౌంట్ ఇవ్వాల్సి వస్తుంది. అయినా, మిగిలిన లాభం ఆపరేటింగ్ మార్జిన్‌లో కనిపిస్తుంది.2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయంలో 31 శాతం, సుమారు 2 బిలియన్ డాలర్లు US నుంచే వచ్చింది. అక్కడి మార్కెట్ ధరలు రెవెన్యూకి చాలా కీలకం. జెనరిక్ మెడిసిన్‌లో ధరల ఒత్తిడి ఉంది. కానీ స్పెషాలిటీ డ్రగ్స్ (ప్రత్యేక మందులు) సెగ్మెంట్‌ను కంపెనీ పెంచుకుంటోంది. USలో స్పెషాలిటీ మందులకు పెద్ద మార్కెట్. కాబట్టి రూపాయి తగ్గడం ఈ కంపెనీకి మంచిది.2025 ఆర్థిక సంవత్సరంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఆదాయంలో 23 శాతం అమెరికా నుంచే వచ్చింది. అయితే భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం ఓకే అయితే టారిఫ్‌లు తగ్గి, JLRకి మంచి రెవెన్యూ వస్తుంది. రూపాయి తగ్గడం వల్ల ఎగుమతుల ఖర్చు తగ్గుతుంది. అలాగే కంపెనీ మార్కెట్ పెరుగుతుంది.రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగుమతులు కూడా చేస్తుంది. పెట్రోకెమికల్స్, రిఫైనింగ్ వ్యాపారంలో అమెరికా, యూరప్‌కు వస్తువులు అమ్ముతుంది. రూపాయి తగ్గడం వల్ల డాలర్ ఆదాయం ఎక్కువ అవుతుంది. అయితే ఈ కంపెనీ దిగుమతులు కూడా ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ ను ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంది. పూర్తిగా లాభం కాకపోయినా, ఎగుమతుల ద్వారా కొంత ప్రయోజనం పొందుతుంది.స్టీల్, మెటల్స్ ఎగుమతులకు రూపాయి తగ్గడం వల్ల ప్రయోజనం ఉంటుంది. విదేశాలకు స్టీల్ అమ్మేటప్పుడు డాలర్‌లో ఎక్కువ రూపాయిలు వస్తాయి. టాటా స్టీల్ అమెరికా, యూరప్ మార్కెట్లలో బలంగా ఉంది. గ్లోబల్ స్టీల్ డిమాండ్ బాగుంటే కంపెనీ ఎక్కువ ప్రయోజనం పొందుతుంది.మొత్తంగా ఆర్బీ రూపాయిని ఆయుధంగా మార్చి అమెరికా టారిఫ్ యుద్ధంలో భారత్ విజయం సాధించింది. సామాన్యుడికి తాత్కాలిక ఒత్తిడి ఉన్నా, దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ప్రతిపక్షం

హైదరాబాద్
మంగళవారం
20.01.2026

# సంస్కరణలో భాగమే పది, ఇంటర్ బోర్డుల విలీనం

**రాష్ట్రంలో పదవ తరగతి, ఇంటర్ బోర్డులను కలిపేసి 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు' పేరిట ఒకే బోర్డుగా ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రభుత్వం ఆ బోర్డు అకడమిక్ గా విద్యా ప్రమాణాలకు అనుగుణంగా మూల్యాంకనం జరిపే విధంగా పాఠ్యపుస్తకాలు, విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలు, మూల్యాంకన విధానాలపై అవగాహన కలిగిన సబ్జెక్టు వారి అకడమిక్ సిబ్బందిని కూడా నియమించాలి. బోర్డును బలోపేతం చేయాలి.**



సుధాకర్.ఏ.వి
9000674747

ఎస్ఎస్‌సీ,ఇంటర్ బోర్డులు విలీనం కానున్నాయా? అయితే చోటు చేసుకునే పరిణామాలేమిటి? ప్రస్తుతం విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఇంటర్మీడియట్ ఉద్యోగ సంఘాలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నది. తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్ లో ఈ అంశాన్ని పొందు పరచిన ప్రభుత్వం సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ (SSC), ఇంటర్మీడియట్ బోర్డులను కలిపి, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటుచేయనుంది. సంస్కరణం అంటే సరిదిద్దడం, ప్రజాక్షేమం కోసం వ్యవస్థలను బలోపేతం చేయడం తద్వారా అభివృద్ధిని సాధించి ఆ అభివృద్ధి ఫలాలను అందరూ పొందేలా చేయడానికి పాలనాపరమైన సంస్కరణలు అనివార్యం. విద్య అనేది ఒక స్థిరమైన వ్యవస్థ కాదు. అది కాలానుగుణంగా మార్పులకు లోనవుతుంది. సమాజం,సాంకేతికత,ఆర్థిక పరిస్థితులు,ఉద్యోగావకాశాలు, జీవన శైలులు మారుతుంటే విద్యావిధానాలు కూడా మారుతుంటాయి. జీవితంలో వ్యవస్థలన్నీకాలాన్ని బట్టి మార్పుకు లోనవుతాయి 21వ శతాబ్దపు నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నా, పోటీ ప్రపంచంలో నిలబడాలన్న సంస్కరణలు అవసరం. అయితే ఇవి తక్షణ ఫలితాలు ఇవ్వకపోయినా దీర్ఘకాలంలో అనేక ప్రయోజనాలను అందిస్తూ ఆలోచనా ధోరణులు, నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధిని, సామాజిక సమానత్వాన్ని ప్రభావితం చేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు.ప్రతి విద్యా సంస్కరణను జాతీయ నిర్మాణ యజ్ఞంగా పరిగణించాలి. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ విద్యారంగం నిర్మాణాత్మక, ఆర్థిక, నాణ్యతాపరమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది. విద్యాపరంగా ఎదురవుతున్న సవాళ్ళు, ప్రతి సవాళ్ళను ఎదుర్కొని విద్యారంగాన్ని పటిష్టపరచడానికై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు చేపట్టడం అభినందనీయం.ఈ సంస్కరణల పరంపరలో భాగంగా పాఠశాల విద్యలోని పదవ తరగతి పరీక్షల బోర్డు, ఇంటర్మీడియట్ బోర్డు విలీనం కానున్నాయని పత్రికల మరియు సోషల్ మీడియా కథనం. ఆ కథనాల ప్రకారం చూస్తే త్వరలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పు జరిగే అవకాశం ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై స్పందిస్తూ రెండు బోర్డులు ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైదరాబాదులో జరిగిన పాఠశాల విద్యాబోర్డుల మండలి సమావేశంలో కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్లకు వేర్వేరు బోర్డులు ఉండడంవల్ల గందరగోళం ఏర్పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా కేవలం ఆరు రాష్ట్రాలలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమబెంగాల్, ఒడిశా, మణిపూర్ రాష్ట్రాల్లో మాత్రమే పది, ఇంటర్లకు వేర్వేరు బోర్డులు ఉన్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా మాట్లాడి ఆ రెండు బోర్డులను విలీనం చేస్తామని తెలుపడం జరిగింది. పదవ తరగతి, ఇంటర్ బోర్డుల విలీన ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నా విలీనం వలన కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విలీన ప్రతిపాదనను స్వాగతించాల్సిన అవసరం అనివార్యం.వాస్తవంగా చూస్తే పాఠశాల విద్యకు, ఇంటర్ విద్యకు మధ్య విద్యా ప్రమాణాలు, సిలబస్,బోధన, పరీక్ష విధానం మొదలైన అకడమిక్ అంశాలలో అంతరం



ఉన్నది. పదవ తరగతి వరకు నిరంతర సమగ్ర మూల్యాంకన విధానంలో విద్యను అభ్యసిస్తూ బట్టీ విధానానికి వ్యతిరేకంగా తమ ఆలోచనతో స్వీయ వ్యక్తీకరణ చేయగలిగిన విద్యార్థులు ఇంటర్ లో చేరగానే మళ్ళీ బట్టీ విధానంలోకి వెళ్ళిపోతున్నారనేది వాస్తవం.పదవ తరగతి వరకు పిల్లల ఆలోచనలకు,అభిప్రాయాలకు, అనుభూతులకు, అనుభవాలకు పెద్దపీట వేసిన విద్యావిధానం ఇంటర్ విద్యలో లేకపోవడం గమనార్హం. అందుకే ఈ బోర్డుల విలీనం వల్ల విద్యార్థుల సామర్థ్యాలను, అభ్యసన ఫలితాలను పరీక్షించే విధానాలు ఒకటిగా ఉండే అవకాశం ఏర్పడుతుంది. అది విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. పదవ తరగతి, ఇంటర్ బోర్డులను విలీనం చేసి 12వ తరగతి వరకు ఒకే బోర్డు పరిధిలోకి తీసుకురావడం వలన విద్యార్థుల డ్రాపౌట్ లు తగ్గించవచ్చు. ఒకే క్యాంపస్ లో 12వ తరగతి వరకు విద్యార్థి కొనసాగితే మధ్యలో మానేసే అవకాశం ఉండదని కేంద్రం కూడా భావిస్తోంది. అయితే బోర్టుల విలీనం నిర్వహణ పరంగా కొత్త సమస్యలను సృష్టిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నవారు కూడా ఉన్నారు. పర్యవేక్షణ, పరిపాలన కష్టమవుతుందని వారి వాదన. అంతేకాదు టీచర్లు, లెక్చరర్లు, హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాల్ విధులు, విభజన గురించి కూడా సర్వత్రా చర్చ జరుగుతున్నది. భవిష్యత్తులో నియామకాలు, ప్రమోషన్లు ఏవిధంగా ఉంటాయోనని ఉత్సుకతకు ఆస్కారం ఏర్పడింది. ఇవన్నీ నిజమే కావచ్చు. అది ప్రభుత్వ పాలసీకి చెందిన విషయం. బోర్డుల విలీనం దాని విధి విధానాలు, ఉద్యోగుల పని, అర్హతలు మొదలైనవన్నీ ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. పరిపాలనా పరంగా ఏవిధమైన చర్యలు చేపట్టాలో కూడా ప్రభుత్వం ఆలోచించగలదు. పోస్టులు, హోదాలు, ప్రమోషన్లు ఇవి పక్కకు పెడితే ముఖ్యంగా ఆలోచించాల్సింది బోర్డుల విలీనంవల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు గురించి.పదవ తరగతి, ఇంటర్ విద్యలకు వేర్వేరు బోర్డులున్న ఆరు రాష్ట్రాలలో ఉన్న పరిస్థితులను, రెండు బోర్డుల స్థానంలో ఒకే బోర్డు ఉన్న మిగతా రాష్ట్రాలలోని పరిస్థితులను అధ్యయనం చేసి విద్యార్థులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలి. సాధారణంగా పరీక్షల బోర్టులు పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించే కార్యాలయాలుగా మిగిలిపోయాయి అనేది నిర్వివాదాంశం. పరీక్షల బోర్డు అనేది కేవలం పరీక్షల కేంద్రంగా కాకుండా మూల్యాంకన విధానంపై పూర్తిస్థాయి అవగాహన కలిగిన అకడమిక్ బోర్డుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో పదవ తరగతి, ఇంటర్ బోర్డులను కలిపేసి 'తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు' పేరిట ఒకే బోర్డుగా ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రభుత్వం ఆ బోర్డు అకడమిక్ గా విద్యా ప్రమాణాలకు అనుగుణంగా మూల్యాంకనం జరిపే విధంగా పాఠ్యపుస్తకాలు, విద్యా ప్రమాణాలు, అభ్యసన ఫలితాలు, మూల్యాంకన విధానాలపై అవగాహన కలిగిన సబ్జెక్టు వారి అకడమిక్ సిబ్బందిని కూడా నియమించాలి. బోర్డును బలోపేతం చేయాలి.

నాణ్యత ప్రమాణాల కోసం, విద్యార్థులకు నిరంతర సమగ్ర విద్యా విధానాన్ని అందించడం కోసం ప్రభుత్వం తీసుకున్న విలీన నిర్ణయాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ స్వాగతిస్తోంది. అయితే విలీనానికి ముందు ఒకసారి సమగ్రమైన అధ్యయనం చేసి, నిర్మాణాత్మక ప్రణాళికతో తగిన చర్యలు చేపట్టాలని సూచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికోసం చేపట్టే కార్యక్రమాల్లో అన్ని సంఘాలు తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉన్నది. విద్యారంగంలో నూతన సంస్కరణలతో దూసుకుపోతున్న తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే మెరుగైన విద్యా విధానాన్ని అందించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలని గౌరవ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగారైన అనుముల రేవంత్ రెడ్డి గారు కృత నిశ్చయంతో ఉన్నారు. ఆ ఆశయం నెరవేరేందుకు సీనియర్ ఉపాధ్యాయ సంఘమైన ఎస్టీయూ మెరుగైన సలహాలు, సూచనలు అందించడానికి ప్రభుత్వానికి తోడ్పడుతుంది అనడంలో సందేహం లేదు.

**(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్ )**

# సామాన్యుడికి అంతర్జాతీయ గౌరవం దక్కేదెప్పుడు?



వెంకగారి భూమయ్య
9848559863

ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక దేశం యొక్క ఆర్థిక శక్తిని, దౌత్య గౌరవాన్ని కొలిచే గీటురాయి ఆ దేశం జారీ చేసే పాస్‌పోర్ట్. ఇటీవల విడుదలైన హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026 నివేదికలో భారత పాస్‌పోర్ట్ 85వ స్థానం నుండి 80వ స్థానానికి చేరుకోవడం మన దేశ దౌత్య విజయాల్లో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ఐదు మెట్ల ఎదుగుదల కేవలం ఒక అంకెకు సంబంధించిన మార్పు మాత్రమే కాదు, అంతర్జాతీయ వేదికపై భారత్ పట్ల ఇతర దేశాలకు పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం. అయితే, అగ్రరాజ్యాల సరసన మన దేశం నిలబడాలంటే ఈ ర్యాంకు సరిపోతుందా లేదా మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలనే అంశంపై లోతైన విశ్లేషణ అవసరం. పాస్‌పోర్ట్ శక్తి అంటే కేవలం విదేశాలకు వెళ్లడం మాత్రమే కాదు, అది మన దేశ పౌరుడికి అంతర్జాతీయ సరిహద్దుల వద్ద లభించే గౌరవం మరియు భద్రతకు ప్రతీక.

**దౌత్య విజయాలు - మారుతున్న గణాంకాలు**

ప్రస్తుత గణాంకాల ప్రకారం భారత పాస్‌పోర్ట్ కలిగి ఉన్న పౌరులు ప్రపంచవ్యాప్తంగా 55 దేశాలకు ముందస్తు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య పెరగడం శుభపరిణామం. ముఖ్యంగా జర్మనీ వంటి యూరోపియన్ దిగ్గజ దేశం భారతీయులకు ట్రాన్సిట్ వీసా మినహాయింపు ఇవ్వడం మన విదేశాంగ నీతికి లభించిన గొప్ప గుర్తింపు. గతంలో అమెరికా లేదా ఇతర పశ్చిమ దేశాలకు వెళ్లే భారతీయులు జర్మనీ విమానాశ్రయాల్లో విమానం మారాలన్నా ఎంతో కష్టపడాల్సి వచ్చేది. ఇప్పుడు అటువంటి అడ్డంకులు తొలగిపోవడం వల్ల సామాన్య ప్రయాణికుడికి సమయం మరియు ధనం ఆదా అవుతున్నాయి. అయినప్పటికీ, సింగపూర్ లేదా జపాన్ వంటి దేశాల పాస్‌పోర్ట్‌లతో పోలిస్తే మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. ఆ దేశాల పౌరులు సుమారు 190కి పైగా దేశాలకు ఎటువంటి వీసా లేకుండా వెళ్లగలుగుతుంటే, మనం ఇంకా వంద లోపు దేశాలకు కూడా చేరుకోలేకపోవడం గమనార్హం.

**మేధో వలసలు - పౌరసత్వ సవాలు**

ఈ కథనంలో మనం ప్రధానంగా చర్చించాల్సిన మరో కీలక అంశం మేధో వలసలు మరియు దేశ పౌరసత్వాన్ని వదులుకుంటున్న వారి సంఖ్య. ఏటా వేలాది మంది ప్రతిభావంతులైన భారతీయులు, వ్యాపారవేత్తలు ఇతర దేశాల పౌరసత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి కారణం మాతృభూమిపై ప్రేమ లేకపోవడం కాదు, కేవలం అంతర్జాతీయ ప్రయాణాల్లో ఎదురయ్యే ఇబ్బందులే. ఒక విదేశీ పాస్‌పోర్ట్ ఉంటే ప్రపంచవ్యాప్తంగా వ్యాపార కార్యకలాపాలు సాగించడం, తక్కువ సమయంలో ఎక్కువ దేశాలు సందర్శించడం సులభమవుతుంది. దీనివల్ల మన దేశానికి




చెందిన మేధో సంపత్తి మరియు సంపద ఇతర దేశాలకు తరలిపోతున్నాయి. భారత్ ప్రస్తుతం ద్వంద్వ పౌరసత్వానికి అనుమతి ఇవ్వడం లేదు. దీనివల్ల విదేశాల్లో స్థిరపడిన వారు భారత పౌరసత్వాన్ని వదులుకోవాల్సి వస్తోంది. ఒకవేళ ప్రభుత్వం ద్వంద్వ పౌరసత్వానికి అనుమతి ఇస్తే, విదేశాల్లోని భారతీయులు తమ మూలాలను మరచిపోకుండా దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంటుంది.

**ఆర్థిక బలం - భద్రతా సవాళ్లు**

భారత పాస్‌పోర్ట్ శక్తి పెరగాలంటే కేవలం దౌత్య చర్చలు మాత్రమే సరిపోవు, మన దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. ఒక దేశం ఆర్థికంగా ఎంత బలంగా ఉంటే, ఆ దేశ పౌరులను తమ దేశంలోకి ఆహ్వానించడానికి ఇతర దేశాలు అంతగా ఆసక్తి చూపుతాయి. గత కొన్నేళ్లుగా భారత్ ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. దీని ఫలితంగానే మన పాస్‌పోర్ట్ ర్యాంకు మెరుగుపడుతోంది. అయితే, అభివృద్ధి చెందిన దేశాలు భారతీయులకు వీసా మినహాయింపు ఇవ్వడానికి ప్రధానంగా భద్రత మరియు వలసల అంశాలను సాకుగా చూపుతున్నాయి. భారతీయులు పర్యాటక వీసాపై వెళ్లి అక్కడ అక్రమంగా స్థిరపడతారనే భయాన్ని తొలగించాల్సిన బాధ్యత పౌరులపైన మరియు ప్రభుత్వంపైన ఉంది. బాధ్యతాయుతమైన పౌరులుగా మనం అంతర్జాతీయ నిబంధనలను గౌరవించినప్పుడే మన దేశ ప్రతిష్ట పెరుగుతుంది.

**ఆత్మగౌరవానికి అసలైన సాక్ష్యం**

ముగింపుగా చెప్పాలంటే, పాస్‌పోర్ట్ ర్యాంకు 80వ స్థానానికి చేరడం ఒక శుభారంభం మాత్రమే. విశ్వగురువుగా ఎదగాలని కలలు కంటున్న తరుణంలో, మన పౌరులు విదేశీ రాయబార కార్యాలయాల ముందు వీసా కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి మారాలి. ప్రభుత్వం విదేశాంగ విధానంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి. ముఖ్యంగా ద్వంద్వ పౌరసత్వం వంటి అంశాలపై జాతీయ స్థాయిలో చర్చ జరిపి, దేశ ప్రయోజనాలకు భంగం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే విదేశాల్లోని మన మేధావులు తిరిగి దేశానికి వస్తారు లేదా ఇక్కడ పెట్టుబడులు పెడతారు. సరిహద్దులు లేని ప్రపంచంలో భారతీయ పౌరుడు గర్వంగా, ఎటువంటి ఆంక్షలు లేకుండా అడుగు పెట్టే రోజు రావాలి. అప్పుడే మన పాస్‌పోర్ట్ కేవలం ఒక గుర్తింపు పత్రంగా కాకుండా, భారతీయుడి ఆత్మగౌరవానికి మరియు ప్రపంచ స్థాయి గుర్తింపునకు అసలైన సాక్ష్యంగా నిలుస్తుంది. సంఖ్యల పరంగా ఎదుగుదల ముఖ్యం కావచ్చు, కానీ ఆ సంఖ్యల వెనుక ఉన్న పౌరుడికి దక్కే అంతర్జాతీయ గౌరవమే అసలైన విజయం.

**(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ )**




# గిగ్ కార్మికుల డిమాండ్స్ నెరవేర్చాలి

బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్‌కామర్స్ యాప్‌లు, ప్రకటనలపై "10 నిమిషాల డెలివరీ" వాగ్దానానికి వ్యతిరేకంగా గిగ్ కార్మికులు గత కొన్ని నెలలుగా నిరసన తెలుపుతున్నారు. కంపెనీ విధించిన కఠినమైన గడువులను తీర్చడానికి భారీ ట్రాఫిక్ చెడు వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరంగా డ్రైవ్ చేయవలసి వస్తుందని, ఇది తీవ్రమైన ఒత్తిడి ప్రమాదాలకు దారితీస్తుందని డెలివరీ బాయ్స్ తెలుపుతున్నారు. గిగ్ కార్మికులు మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ, కిలోమీటరుకు కనీస స్థిర ధర, హామీతో కూడిన కనీస నెలవారీ ఆదాయాన్ని కోరుతున్నారు. వారి ప్రస్తుత సంపాదన చాలా తక్కువగా ఉంది. 12 నుండి 15 గంటల పాటు పనిచేసిన తర్వాత కూడా, వారు తరచుగా రోజుకు రూ. 500 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. తమ వాహనాలకు పెట్రోల్, నిర్వహణ ఖర్చులను వారే భరించాల్సి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.గిగ్ కార్మికులను "కార్మికులు"గా గుర్తించరు కానీ "స్వతంత్ర కాంట్రాక్టర్లు"గా వర్గీకరించారు. వారికి ఎలాంటి సామాజిక భద్రత లేకుండా ఆరోగ్యం , ప్రమాద బీమా, పెన్షన్లు,ప్రయోజనాలు లేకుండా జీవిస్తున్నారు.గిగ్ కార్మికులు ఏ క్షణంలోనైనా తమ ఉద్యోగాలను కోల్పోవచ్చు. వారు ఎల్లప్పుడూ అగ్రిగేటర్,కంపెనీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటారు. కంపెనీ ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా వారి ఖాతాలను బ్లాక్ చేస్తుంది. అన్యాయమైన రేటింగ్‌ల ఆధారంగా కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడం అమానవీయ చర్య,చిన్న కారణాలకే కంపెనీ తమ ఖాతాలను బ్లాక్ చేయడం నిలిపివేయాలి.అధిక వేతనాలు ,కంపెనీ వేధింపులు,అక్రమ ఉద్యోగాల తొలగింపుల నుండి చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత,ఆర్థిక భద్రత,కార్మికులుగా' చట్టపరమైన గుర్తింపు వంటి గిగ్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి.



ఆళవందార్ వేణు మాధవ్
8686051752 ,హైదరాబాద్

## రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

## రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

# నిష్పక్షపాతంగా గ్రామాల్లో పని చేయాలి

- పల్లె పాలనపై పట్టు సాధించాలి
- పల్లెలో సుపరిపాలన దిశగా అడుగులు
- గ్రామాల్లోని సర్పంచులు గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలి
- నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 18 :**

గ్రామాలలో సర్పంచులు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజల కోసం సేవ చేయాలని ముఖ్యంగా గ్రామాలలో గ్రూప్ రాజకీయాలను చేయవద్దని ప్రోత్సహించవద్దని సర్పంచుల పనితీరుపై రాష్ట్రంలో గ్రామాలకు గుర్తింపు లభిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా అన్నారు మెదక్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఐదు రోజుల పాటు సర్పంచుల శిక్షణ తరగతులు జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో స్వచ్ఛమైన వాతావరణం ఉంటుందని ఆ వాతావరణం లో సర్పంచుల కీలకపాత్ర వహిస్తూ కుల మతాలకతీతంగా అభివృద్ధి చేయాలని.గ్రామ స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా మంచి చెడుల న్యాయ నిర్ణేత సర్పంచ్ లే ఆయన తెలిపారు ఓటు వేసిన వారిని ఓటు వేయని వారిని ప్రభుత్వ పథకాల లో సమాన స్థాయిలో చూడాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామాలలో అక్షర శాతం పెంచాలని బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ కుల నిర్మూలన మూఢ నమ్మకాల నిర్మూలనలో సర్పంచ్ లదే కీలక పాత్ర ఆయన తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం పాపన్నపేట,నర్సింగి,మెదక్,హవేలీఘనాపూర్ (4) మండలం లోని దాదాపు 100 మంది సర్పంచులకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని,ఈ శిక్షణ కార్యక్రమం లో సర్పంచులు పంచాయతీ చట్టాలపై పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టం లోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు వంటి,విపత్తుల సమయం లో సర్పంచ్ ల పాత్ర, డిజిటల్ సైన్, ఆదర్శ గ్రామపంచాయతీ ల నిర్మాణం తదితర అంశాలపై సర్పంచ్ ల బాధ్యతలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, పంచాయతీ రాజ్ చట్టం లోని ప్రతీ అంశాన్ని సర్పంచ్ లు అవగాహన కలిగి ఉండాలన్నారు.విద్య, వైద్యం నిరుపేదలకు అందేలా సర్పంచ్ లు కృషి చేయాలన్నారుమానవత్వ కోణం లో పని చేయాలనీ సూచిస్తు.డిజిటల్ గవర్నెన్స్ కి దోహద పడాలన్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్, తదితర అంశాల పైన కూడా సర్పంచ్ లకు అవగాహన ఉండాలన్నారుగ్రామాల్లోని సర్పంచు లు గ్రూప్ రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు.గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి,సామాజిక అభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్లు ఉపయోగించాలన్నారు. మరుగు దొడ్లు లేకపోతే కట్టించే ఏర్పాట్లు చేయాలన్నారు.ఎప్పటికప్పుడు చెత్త సేకరణ,పిచ్చి మొక్కల తొలగింపు,వర్షాకాలంలో నీటి నిల్వ తొలగింపు,సీజనల్ అంటూ వ్యాధుల రాకుండా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలన్ని సర్పంచులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ పి రవీందర్, డి పి వో యాదయ్య, జెడ్పి సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ లు డి ఎల్ పి వో సురేష్, సాయిబాబా, ఎం పి డి ఓ లు చిన్న రెడ్డి, షాజీవోద్దీన్,తిరుపతి రెడ్డి,మోజామ్, మహిపాల్ రెడ్డి, ముజీబ్, సర్పంచ్లు ,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గజ్వేల్‌లో 'ప్రతిపక్షం' దినపత్రిక
# క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రతిపక్షం గజ్వేల్, జనవరి 19:**

గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం 'ప్రతిపక్షం' దినపత్రిక క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, రజిత, బాలేష్, దత్తు, గజ్వేల్ ప్రతిపక్షం ప్రతినిధి పులి బాలచంద్రుడు తోపాటు రమేష్,ఐలయ్యలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండాలు

- పసుపు బండారి మయమైన మల్లన్న క్షేత్రం..
- మల్లన్న నామస్మరణతో మార్మోగిన తోటబావి ప్రాంగణం.
- పట్నంవారం భారీగా తరలివచ్చిన భక్తులు.

**ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 19 :**

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలోని 2026 జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్నంవారం (మొదటి ఆదివారం) పురస్కరించుకొని ఆలయ తోటబావి వద్ద జరిగిన పెద్దపట్నం, అగ్నిగుండాలను ఘనంగా నిర్వహించడంతోఆలయ ప్రాంగణాలు పసుపువర్ణ శోభితమైంది. సోమవారం హైదరాబాద్ జంట నగరాలకు చెందిన యాదవ భక్తులు సుమారు 30 వేల మంది భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండాలు నేరుగా తిలకించారు. ఆలయ తోటబావి వద్ద ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ కు చెందిన మానుక పోచయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, దుర్గాప్రసాద్ యాదవ్, యాదవ సంఘం సభ్యులు శివసత్తులు, భక్తుల ఆధ్వర్యంలో 25 వరుసల పెద్దపట్నం వేసి, క్వింటాళ్ళ కొద్దీ సమిదలు కాల్చి బగబగ మండే నిప్పు రవ్వలతోతయారు చేసి అగ్నిగుండాలను ఘనంగా నిర్వహించారు. తోటబావి వద్ద భక్తులు పసుపు బండారిని చల్లు కోవడంతో ఆలయ తోటబావి ప్రాంగణం, రాజగోపురంతో పాటు స్వామివారి సన్నిధి పసుపు బండారి మయమైంది. ఆలయ తోటబావి వద్ద పంచవర్ణాలను వేసిన పెద్దపటాన్ని దాటుకుంటూ అగ్నిగుండ ప్రవేశం చేస్తూ అగ్నిగుండాలు దాటుతూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకుని భక్తులు భక్తితో తన్మయత్వం పొందారు. సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాలతోమల్లన్నక్షేత్రంలో 2026 జాతర బ్రహోత్సవాలు ప్రారంభమైయ్యాయి.





**ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండాలు..**

ఆలయ తోటబావి ప్రాంగణంలో మల్లన్న కళ్యాణ మండపం వద్ద అగ్నిగుండాలు, పెద్దపట్నం నిర్వహించ డంతో సుమారు 30 వేల మంది భక్తులు రావడంతో ఆ ప్రాంగణం మల్లన్న నామస్మరణంతో మారుమోగింది. అగ్నిగుండాలను, పెద్దపట్నం తిలకించేందుకూ భక్తులు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్ యాదవ్ ఒగ్గు పూజారులు డప్పు చప్పులతో ఊరేగింపుగా వెళ్లి ఆలయ గర్భ గుడిలోని ఉచ్చ విగ్రహాలతో ఆలయ అర్చకులు ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్తో పాటు అర్చకులు ఉత్సవ విగ్రహాలను గర్భగుడి నుంచి ఊరేగింపుగా పెద్దపట్నం వద్దకు చేర్చి యాదవుల సాంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు (కల్యాణం) నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు ఉత్సవ విగ్రహాలు పట్టుకొని పెద్దపట్నం, అగ్నిగుండాలు దాటిన తర్వాత గ్యాలరీలలోని భక్తులు, శివసత్తులు, యాదవ భక్తులు అగ్నిగుండాలను దాటుతూ స్వామిని దర్శించుకున్నారు. అనవాయితీ ప్రకారంగా ఆలయ ఈఓ వెంకటేష్, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు హైదరబాద్కు చెందిన యాదవ భక్తులకు, శివసత్తులకు కొత్త బట్టలు పెట్టి, పసుపు బండారి ఉచితంగా పంపిణీ చేసి శివాసత్తులను ఘనంగా సన్మానించారు.

**పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం..**

హుస్నాబాద్ ఏసీపీ సదానందం మాట్లాడుతూ ఆలయ తోటబావి ప్రాంగణంలో జరిగిన పెద్దపట్నం, అగ్నిగుండాలను పురస్కరించుకోని పటిష్ట బందో బస్తూ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాటాడుతూ మొదటి వారం అగ్నిగుండాలు పెద్దపట్నం సందర్భంగా 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, మూడు రోజుల నుంచి బందోబస్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందికి ధన్యావాదాలు తెలిపారు. చేర్యాల సీఐ రవి, కొమురవెల్లి ఎస్ఐ మహేష్‌పాల్గొన్నారు. పెద్దపట్నానికి వచ్చిన భక్తులు పోలీసులు అందిస్తున్న సేవలను కొనియాడి అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, వెలుగల మల్లేశం, కొమురయ్య తో పాటు పలువురు అధికారులు పర్యవేక్షించారు.



# హెల్మెట్‌లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నేత

**ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి 19**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ఐలుకాక ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులతోపాటు రన్నర్ అప్ గా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాన్ని అందించడంతోపాటు తోట కమలాకర్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని ఆయనే స్వయంగా క్రీడాకారులకు హెల్మెట్లను అందించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో, తన పుట్టిన రోజు ఆర్భాటాలు చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా, ఆ డబ్బులతో ఫైనల్ మ్యాచ్లో ఆడిన క్రీడాకారులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపే యువతకు హెల్మెట్లు అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టడంపై యువకులు క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రమాదం జరిగితే ప్రాణాపాయం నుండి తప్పించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు.



# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- మహిళల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే మైనంపల్లి. రోహిత్ రావు.

**ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 19**

మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణంలోని జీకేఆర్ గార్డెన్ లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా మెదక్ పురపాలక సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా జరిగాయి. స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల సబ్సిడీ పంపిణీ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య అతిథిగా హాజరై మెదక్ పట్టణానికి చెందిన 346స్వయం సహాయక సంఘాలకు రూ.90,24,810/ విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను లబ్దిదారులైన మహిళలకు అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, సబ్సిడీలు అందిస్తూ వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నదని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మహిళలను కోరారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మెప్మాఅధికారి సునీత,కాంగ్రెస్ మెదక్ మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ రాగి. అశోక్,పట్టణం పార్టీ అధ్యక్షులు యం.గంగాధర్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మి, జ్యోతి,నాయకులు ముత్యం గౌడ్, మధుసూదన్ రావు, ప్రవీణ్ గౌడ్,కృష్ణ, రమేష్ గౌడ్, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.



## చిరుత దాడిలో
# దూడ మృతి

**ప్రతి పక్షం,దౌల్తాబాద్ జనవరి 19:**

దౌల్తాబాద్ తండా శివారులో చిరుత సంచారం భయాందోళనకు గురి చేస్తోంది. ఆదివారం అర్ధరాత్రి గ్రామ శివారులో రైతు రెడ్యా తన పొలంలో రోజు మాదిరిగా పశువులను కట్టివేశాడు. ఉదయం దూడ లేకపోవడంతో చుట్టుపక్కల చూసే సరికి దూడ మృతదేహం కనిపించడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్ వేణు ఘటనాస్థలికి చేరుకుని చిరుత పులి ఆనవాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో ఉన్న పశువులను ఇంటి వద్దకు తీసుకువెళ్లాలని, చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. గ్రామస్తులు,రైతులు భయాందోళనకు గురికాదని అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ప్రజా వ్యతిరేక బీజేపీ విధానాలపై ఐక్య పోరాటం అవసరం

- కార్మిక-కర్షక మైత్రి సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 19:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. కార్మిక-కర్షక ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. ఈ కోడ్ల వల్ల సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు కోల్పోతున్నారని, అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పేదల జీవనాధారాలను దెబ్బతీస్తున్నారని, విత్తన సవరణ, విద్యుత్ సవరణ బిల్లులు రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తాయని అన్నారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు రైతులు, వ్యవసాయ కార్మికులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం అధ్యక్షత వహించగా, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో అన్ని మున్సిపాలిటీలో కైవసం చేసుకుంటాం

- డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 19 :** రానున్న మున్సిపల్ ఎన్నికలో నిజామాబాద్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలతో పాటు నగర మున్సిపల్ కార్పొరేషన్ ను కైవసం చేసుకుంటామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి మాట్లాడుతూ నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఫిబ్రవరి నెలలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందులో భాగంగానే బోధన్ మున్సిపాలిటీకి జనరల్, నిజామాబాద్ మున్సిపాలిటీకి మహిళా జనరల్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు మహిళా జనరల్ రావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో 70 శాతం సర్పంచులు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం జరిగిందని, అందులో భాగంగానే నిజామాబాద్ లో 545 స్థానాలలో 360 స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం జరిగిందని, దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు 80 శాతం వాగ్దానాలు నెరవేర్చడం జరిగిందని అన్నారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కమిషన్లు తీసుకుంటూనే బోగస్ రైస్ మిల్లు పెట్టి రూ.200 కోట్ల వరకు దోచుకోవడం జరిగిందని ఆరోపించారు. అధికారులను భయపెట్టించి తమ జేబులు నింపుకున్నారని కొందరు అధికారులు గత ఎమ్మెల్యే వల్ల సస్పెండ్ కావడం జరిగిందన్నారు. బోధన్ పట్టణానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఏనలేని అభివృద్ధి చేయడం జరిగిందని, బోధన్ పట్టణ మున్సిపల్ ను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది అని ఆయన అన్నారు. నిజామాబాద్ నగరం లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు డి శ్రీనివాస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గతంలో 5 సంవత్సరాలు బీజేపీ, 10 సంవత్సరాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇప్పుడు సూర్యనారాయణ రెండు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నా కూడా జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బైంసా అల్లర్లను ఎంపీ అరవింద్ అడ్డుపెట్టుకొని మున్సిపల్ ఎన్నికల్లో 28 స్థానాలు గెలిపించుకోవడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే మహేష్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి ల నాయకత్వంలో నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్తామని, మిగిలిన మూడు మున్సిపాలిటీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కైవసం చేసుకుంటుందని నగేష్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నూడా చైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావీద్ అక్రం, ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఘన్ రాజ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగం, జిల్లా ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్, ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర కార్యదర్శి వేణు రాజు, వినయ్, సుమన్, ఏజాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# బహుజన రాజ్య సాధన కోసం పార్టీకి పిల్లల దత్తత

- బహుజన సిద్ధాంతాల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూన, బీఎస్పీ ఉట్కూర్ మండల ఇంచార్జి కొక్కు గౌతమ్

**ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 19**

బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి, కుమారి బెహంజీ మాయావతి జన్మదిన వేడుకల సందర్భంగా షాద్‌నగర్ వేదికగా ఒక చారిత్రాత్మక సంఘటన చోటుచేసుకుంది. మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ గ్రామానికి చెందిన బీఎస్పీ మండల ఇంచార్జి కొక్కు గౌతమ్, బహుజన సిద్ధాంతాల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ తన కుమారుడు శరత్ అంబేద్కర్, కుమార్తె మాయావతిలను పార్టీకి దత్తత ఇచ్చారు. అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా మహనీయుల ఆశయ సాధన కోసం వారిని తీర్చిదిద్దాలని కోరుతూ బహిరంగ సభ సాక్షిగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అపూర్వ ఘట్టాన్ని ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ మాట్లాడుతూ పిల్లలను సమాజ హితం కోసం, బహుజన అధికారం కోసం పార్టీకి దత్తత ఇవ్వడం అనేది సామాన్యమైన విషయం కాదని, ఇది కొక్కు గౌతమ్ గారికి పార్టీపై ఉన్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. నేటి నుండి ఆ పిల్లల జీవితాలు అణగారిన వర్గాల విముక్తి కోసం అంకితమవుతాయని ఆయన ఆకాంక్షించారు.ఈ వేడుకలకు ఉత్తరప్రదేశ్ మాజీ ఎమ్మెల్సీ హతర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాయావతి నాయకత్వంలో బహుజన రాజ్య స్థాపన దిశగా కార్యకర్తలు కదలాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కొక్కు గౌతమ్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.



న్యూజీలాండ్ తో జరిగిన మూడో వన్డేలో నితీష్ కుమార్ రెడ్డి హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. పాండ్యాకు నితీష్ సరైన బ్యాకప్. 135 కి.మీ. వేగంతో బౌలింగ్, భారీ షాట్లు కొట్టగల బ్యాటింగ్ సామర్థ్యం అతనికి ఉంది. వరుసగా ఫెయిలయినా మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. కోహ్లీతో నితీష్ నెలకొల్పిన 88 పరుగుల భాగస్వామ్యం అతని టాలెంట్‌కు నిదర్శనం

- ఇర్ఫాన్ పఠాన్, మాజీ క్రికెటర్

ప్రాంతీయం

## ఘనంగా కర్నాల్ పల్లి
# రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



**ప్రతిపక్షం, చేగుంట, జనవరి 19:**

చేగుంట మండలం కర్నాల్ పల్లి రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి . ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో పాటు సర్పంచ్ రేణుక రాములుగౌడ్ వారిని సన్మానించారు. ప్రతి ఏటా మూడు రోజులపాటు కొనసాగే ఎల్లమ్మ జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రేణుక ఎల్లమ్మ జీవిత చరిత్రపై ఒగ్గు కళాకారులు కళా ప్రదర్శనలు ఇచ్చారు. పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధికి డ్రోన్లు కీలకం

- **ఐదు రోజుల డ్రోన్ బూట్ క్యాంప్ ప్రారంభంలో సీ-డాక్ నిపుణుడు ప్రణయ్**

**ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18 :**



దేశ సాంకేతిక, ఆర్థికాభివృద్ధిలో డ్రోన్ల ప్రాధాన్యం రోజురోజుకీ పెరుగుతోందని సీడాక్ హైదరాబాద్ ప్రాజెక్టు లీడర్ ఎం. ప్రణయ్ అన్నారు. రక్షణ రంగంతో పాటు వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, సర్వేలు, డెలివరీ సేవల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అటానమస్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ & డ్రోన్ టెక్నాలజీస్'పై నిర్వహిస్తున్న ఐదు రోజుల బూట్ క్యాంప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. MeitY స్వాయాన్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రోన్ వర్గీకరణ, భాగాలు, వినియోగ విధానాలు, డీజీసీఏ నిబంధనలు, భద్రత, డ్రోన్ అసెంబ్లింగ్, ఫ్లయింగ్, సిమ్యులేషన్ వంటి అంశాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అందిస్తారని చెప్పారు. కార్యక్రమం పూర్తిచేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ప్రారంభ కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. మాధవి, నిర్వాహకురాలు డాక్టర్ డి. అనిత, సహనిర్వాహకుడు డాక్టర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



## సంయుక్త పాఠశాలలో
# "అరైవ్ అలైవ్ – 2026" రోడ్డు భద్రతా అవగాహన

**ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18:**

సంగారెడ్డి పట్టణంలోని సంయుక్త పాఠశాలలో "అరైవ్ అలైవ్ - 2026" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ గమ్యస్థానానికి చేరుకోవడమే కాదు, సురక్షితంగా చేరుకోవడమే ముఖ్యమని అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని, విద్యార్థులే భవిష్యత్తు బాధ్యతాయుత పౌరులని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్ స్పీడ్ ప్రాణాపాయానికి దారి తీస్తుందని హెచ్చరించారు. అనంతరం "అరైవ్ అలైవ్ - 2026" పోస్టర్లను ఆవిష్కరించి, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. వాహనదారులతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనే ప్రతిజ్ఞ చేయించారు. మహిళా కానిస్టేబుల్ వనజ రూపొందించిన ట్రాఫిక్ అవగాహన ముగ్గును ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కొండాపూర్ ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్, ఎస్ఐ సోమేశ్వరి, మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

- **అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు కోరే శేఖర్**

**ప్రతి పక్షం,దౌల్తాబాద్,జనవరి19:**



అఖిల రాజ్ ఫౌండేషన్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ అమెరికా ప్లాస్టిక్ సర్జరీ వైద్యులచే ఉచితంగా నిర్వహించే ప్లాస్టిక్ సర్జరీ శిబిరం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు కోరే శేఖర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలో ముబారస్ పూర్ లో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల రాజ్ ఫౌండేషన్ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ అమెరికా ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల చేత ఉచిత సర్జరీ శిబిరం హైదరాబాద్ లో జనవరి 26 నుంచి ఫిబ్రవరి 4 వరకు డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్, సీతారాం బాగ్, ఓల్డ్ మల్లేపల్లి, హైదరాబాద్ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో గ్రహణ మొర్రి, కరెంట్ షాక్, అగ్ని ప్రమాదంలో కాలిన గాయాలు మరియు ఇతర కారణాలతో ఇబ్బంది పడుతున్న వారికి లక్షల ఖరీదైన సర్జరీ ఉచితంగా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9949691182, 9908010610 ఫోన్ నంబర్ లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని, పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు విజయ్, కర్ణాకర్,యాదగిరి, స్వామి,పాషా, పర్శరాములు, మహేష్, కెనిల్, నర్సిములు, చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు



# చిన్నారుల కోసం 'సత్యసాయి సంజీవని'

- **డిఎంహెచ్ వో ధనరాజ్**

**ప్రతిపక్షం సిద్దిపేట జనవరి 19:**

గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్య సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థ సిద్ధిపేట జిల్లా కొండపాకలో ఏర్పాటు చేసిన సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభించుకోవడం జరిగిందని డి ఎం హెచ్ వో ధనరాజ్ తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ అందరికీ పుట్టకతో వచ్చే గుండె జబ్బులు గురించి జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశానుసారం డిఎంహెచ్ వో ధనరాజ్ ఆధ్వర్యంలో సీఎంఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 70 మంది డాక్టర్లు పాల్గొన్నారు. డిఎంహెచ్ వో మాట్లాడుతూ ప్రారంభ దశలోనే రోగ నిర్ధారణ మరియు హాస్పిటల్ కు రిఫర్ చేయటం వలన శిశు మరణాలు తగ్గించవచ్చని తెలిపారు. ఇలాంటి కార్యక్రమం జిల్లా అంతట జరపాలని నిర్ణయించారు. శ్రీ సత్యసాయి సంజీవని హాస్పిటల్లో పుట్టుకతో గుండె జబ్బులు వున్న వారికి పూర్తిగా ఉచితంగా చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. హెచ్ఓడి డా. సురేష్, డాక్టర్ సృజన్, శ్రీ సత్య సాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలోనే గుండెజబ్బులు లేని సిద్దిపేట జిల్లాగా చూడాలనేదే నా కోరిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు,హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు వైజ్ఞానికంగా ముందంజలో ఉండాలి

- **టీజీఐఐసీ చైర్పర్సన్ తూర్పు నిర్మల జయప్రకాష్ రెడ్డి**
- **విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలి**
- **దేశ అభివృద్ధికి సాంకేతికతే వెన్నుదన్ను: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18 :**




నేటి విద్యార్థులు తమ విజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలతో దేశ భవిష్యత్తును నిర్మించే ప్రతినిధులుగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. రామచంద్రాపురం మండలం కొల్లూరు గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-2026ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్పర్సన్ తూర్పు నిర్మల జయప్రకాష్ రెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, విఐటిఎం డైరెక్టర్ సాదు భాస్కర్, విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ ప్రదర్శన లక్ష్యమన్నారు. దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమన్నారు. భారతదేశ అభివృద్ధిలో శాస్త్రీయ ఆవిష్కరణలు కీలకమని, భవిష్యత్ భారత్ శాస్త్రసాంకేతికత ఆధారంగా ముందుకు సాగుతుందని తెలిపారు. టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వైజ్ఞానికంగా ముందంజలో ఉండాలని సూచించారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 199 ఎగ్జిబిట్లు, 24 ఎన్‌జీఓల సైన్స్ స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, కార్పొరేటర్ పుష్ప నగేష్, గాడియం స్కూల్ ప్రిన్సిపల్ కీర్తి రెడ్డి, సీఈఓ రామకృష్ణారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అనుకుంటే సాధించలేనిది అంటూ ఉండదు

- **సంగారెడ్డి మున్సిపాలిటీ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
- **సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 560 మహిళా సంఘాలకు రూ. 1 కోటి 96 లక్షల వడ్డీ రాయితీ చెక్కులు అందజేత**

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 18 :**



రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాల కు సంబంధించిన రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 560 మహిళా సంఘాలకు 1 కోటి 96 లక్షల 40 వేల రూపాయల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండడం గొప్ప విషయమని, ఆర్థికంగా తమను తాము నిలదొక్కుకునేలా పొదుపు సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అయితే ఆరూరు, చేర్యాల, మునిదేవునిపల్లి ప్రాంతాల్లో కొత్తగా పరిశ్రమలు స్థాపించబోతున్నట్లు ఆమె తెలిపారు. దీని ద్వారా అనేకమందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి అన్నారు. ఇదే ప్రేరణతో మహిళ పొదుపు సంఘాల సభ్యులు ఒక గ్రూపుగా కలిసి చిన్నచిన్న ఇండస్ట్రీలను పెట్టుకొని ఇతరులకు స్వయంగా వారే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఎదగాలని సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా మహిళలదే పైచేయిగా ఉండబోతుందని ఆమె జోష్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ వడ్డీ లేని రుణాలను తీసుకొని వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డిలో పొదుపు సంఘం ద్వారా రుణం తీసుకుని పట్టణానికి చెందిన భారతి అనే మహిళ డ్రై క్లీనింగ్ షాపును ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగి రాష్ట్రంలోనే ఆమె ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్, షఫీ, బ్యాంకు అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- **వడ్డీ లేని రుణాలు పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**
- **పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. బోధన్ పట్టణంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు సోమవారం బోధన్ లోని రోటరీ భవన్ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి రూ. కోటీ 99 లక్షల విలువ చేసే వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. పట్టణ మహిళా సంఘాలకు మొట్ట మొదటిసారి తమ ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కింద నిధులను కేటాయించిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఇతోధిక తోడ్పాటు గురించి ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, సమాఖ్య ప్రతినిధులు ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు. బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలతో వ్యాపార లావాదేవీల నిర్వహణ ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వంటి వాటిని సైతం మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. రుణాలతో పాటు మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. అయితే, ఎంత ఉత్సాహంగా రుణాలు తీసుకుంటున్నారో, అంతే ఉత్సాహంతో తిరిగి చెల్లించేందుకు చొరవ చూపాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి ప్రతి మహిళా సభ్యురాలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీఆర్డీఏ సాయాగౌడ్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, పట్టణ మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పుల్లూరు బండ జాతర

- **స్వయంభు లక్ష్మీ నృసింహ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు**

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**



సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీ నృసింహ స్వామిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పుల్లూరు బండ జాతర ఆధ్యాత్మిక వైభవంగా ఘనంగా కొనసాగుతోందని తెలిపారు. మాఘ అమావాస్య సందర్భంగా బండపై ఉన్న గుండంలో భక్తులు పవిత్ర స్నానాలు చేసి జాతరను ప్రారంభించగా, నేడు గోపాల కాలువల స్వామి సేవా కార్యక్రమం నిర్వహించారు. రేపు కల్యాణ మహోత్సవం జరగనుండగా, మొత్తం మూడు రోజుల పాటు ఈ జాతర అద్భుతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో సాగనుంది. పుల్లూరు నృసింహ స్వామి క్షేత్రం గొప్ప మహిమ కలిగినదని, పురాతన కాలం నుంచే ఇక్కడ భక్తులు కోరికలు కోరుకుంటే అవి నెరవేరుతాయనే నమ్మకం ఉందని హరీష్ రావు తెలిపారు. వేలాది భక్తుల దర్శనాలతో పుల్లూరు బండ పునీతమైందన్నారు. కేసీఆర్‌కు పుల్లూరు అంటే ప్రత్యేకమైన అభిమానం ఉందని పేర్కొన్న హరీష్‌రావు, పుల్లూరు నృసింహ క్షేత్రాన్ని సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. బండపైకి వాహనాల సౌకర్యం కోసం రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, రూ.35 లక్షల టిటిడి నిధులతో ఆలయ పునరుద్ధరణ, రూ.10 లక్షలతో ఆలయ పరిసరాల్లో షెడ్, రూ.50 లక్షలతో కళ్యాణ మండపం నిర్మించినట్లు వివరించారు.భక్తులకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు మిషన్ భగీరథ పథకం కింద రూ.80 లక్షలతో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ నిర్మించామని తెలిపారు. అదేవిధంగా రూ.20 లక్షలతో సుడా పార్క్, రూ.10 లక్షలతో మినీ ట్యాంకులు, పైప్‌లైన్లు, నల్లాలు, రూ.10 లక్షలతో విద్యుత్ స్థంభాలు, రూ.15 లక్షలతో దేవాలయ స్వాగత తోరణం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో రూ.50 లక్షలు మంజూరు అయ్యాయని, ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, ధర్మసత్రల కోసం టీటీడీకి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వచ్చే జాతర నాటికి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో ద్వజస్తంభ ప్రతిష్ఠ, తిరుపతి నుండి స్వామి మూలవిరాట్ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్న లక్ష్యముందని చెప్పారు. పుల్లూరు బండ క్షేత్రాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సిద్దిపేట జిల్లాలో సుమారు రూ.80 కోట్లతో ఆలయాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. శతాబ్దాల నాటి ఆలయాలకు దశాబ్దంలోనే పూర్వ వైభవం తీసుకొచ్చామని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయక సాగర్ నుంచి గోదావరి జలాలు పుల్లూరు బండ కింద స్వామి పాదాల చెంతకు చేరుతున్నాయని, కాలంతో సంబంధం లేకుండా ఎల్లకాలం నీళ్లు వస్తాయని తెలిపారు. ప్రాంతం పచ్చగా, సస్య శ్యామలంగా విరాజిల్లుతోందన్నారు. ఈ సందర్భంగా బండపై భక్తుల కోసం ఏర్పాటు చేసిన షేవర్స్‌ను హరీష్ రావు ప్రారంభించారు.

## పింఛన్ డబ్బుల కోసం
# తల్లిని చంపిన కొడుకు

**ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి19**


మద్యం తాగేందుకు తన పింఛన్ డబ్బులు, బంగారం ఇవ్వలేదన్న కోపంతో చాకలి రాములు తన కన్నతల్లి నరసమ్మను కట్టెతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన మెదక్ మండలం రాజ్పల్లిలో గ్రామంలో చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై లింగం సంఘటనా స్థలానికి చేరుకుని, నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సీఎం వ్యాఖ్యలపై పోలీస్ కమిషనర్‌కు
# బీఆర్ఎస్ ఫిర్యాదు

**ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 19:**

సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ నేతృత్వంలో పార్టీ నాయకులు హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఖమ్మంలో జరిగిన సీపీఐ శతాబ్ది బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను యావత్ తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం 14 ఏళ్ల ఉద్యమం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని, ఆకాంక్షల పాలన బీఆర్ఎస్‌దని, కాంగ్రెస్ పాలన రాక్షస పాలనగా మారిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను డైవర్ట్ చేయడం మాని ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎనిమిది యుద్ధాలు ఆపినా నోబెల్ శాంతి బహుమతి దక్కలేదు. ఇకపై శాంతిగురించి ఆలోచించను. అమెరికా ప్రయోజనాలే నాకు ముఖ్యం. నోబెల్ ఇవ్వకపోవడమే నా దృక్పథం మారడానికి కారణం.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

ప్రాంతీయం

# రోడ్డు ప్రమాదాలతో రెండు కుటుంబాలు ఛిన్నాభిన్నం

- 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ రితీరాజ్



**కూకట్ పల్లి, ప్రతిపక్షం, జనవరి 19:**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, ప్రజల్లో అవగాహన పెంచేందుకు బాలానగర్ పోలీసులు వినూత్న అవగాహనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం హెచ్ఏఎల్ కమ్యూనిటీ హాల్ లో బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ రాజు ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రైట్ కాన్సెప్ట్ హైస్కూల్ యాజమాన్యం సహకారంతో ఈ కార్యక్రమంలో వాహనదారులకు డీసీపీ రితీరాజ్ హెల్మెట్లు పంపిణీ చేశారు.

**కన్నీరు పెట్టించిన బాధితుల గాథలు:**

ఈ కార్యక్రమం కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయడం అందరినీ ఆలోచింపజేసింది. ప్రమాద బాధితురాలు వందన మాట్లాడుతూ.. తన సోదరుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన ప్రమాదం తమ కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేసిందో వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఒక చిన్న అజాగ్రత్త రెండు కుటుంబాల భవిష్యత్తును అంధకారం చేస్తుందని, ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆమె కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలానగర్ డీసీపీ రితీరాజ్ (ఐపీఎస్) మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల రహిత సమాజ స్థాపనే 'అరైవ్ అలైవ్' ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఏటా సుమారు 3,000 ప్రమాదాలు జరుగుతుండగా, దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్), రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రాణాలు తీస్తున్నాయని ఆమె స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "పోలీసుల లక్ష్యం జరిమానాలు విధించడం కాదు, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలన్నదే మా తపన. ఈ 'అరైవ్ అలైవ్' సందేశం ప్రతి ఇంటికీ చేరాలి." రితీరాజ్, డీసీపీ, బాలానగర్. ఈ సదస్సులో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏడీసీపీ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీను బాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ హరినాథ్, బాలానగర్ ఆర్ఐ నాగమణి, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# లే ఔట్ డిస్ప్లే బోర్డ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద్

**ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, జనవరి 19 :**

131 కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లే ఔట్ డిస్ప్లే బోర్డ్ ను సోమవారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకాలనీ వాసులంతా ఐక్యమత్యంగా ఉన్నపుడే కాలనీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కెఎం.గౌరీష్, కాలనీ అధ్యక్షులు పి.దుర్గారెడ్డి, ఉపాధ్యక్షులు భగీరథరెడ్డి, నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ జలునాథ్ భాను, వేమారెడ్డి, సలహాదారులు సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్య, రామారావు, లింగారెడ్డి, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి కార్తీక్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, యువ నాయకులు గిరిధర్, రమణా రెడ్డి, వెంకట్, ఆంజనేయులు, అజయ్ చారి, బొంబాయి శ్రీను, జయం చారి, రమేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడిగా వేణుమాధవ్

**ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 19:**

తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు (H143) అధ్యక్షుడిగా రేగొండ వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నోజు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా అంతటి శ్రీనివాస్ గౌడ్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ము గిరి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సమావేశంలో యూనియన్ నాయకులు బుస్స శ్రీనివాస్ జిట్ట నరేష్, కొల్లోజు శ్రీకాంత్, కారంపూడి మధు, గుండ్లపల్లి వెంకన్న, మూడ వెంకటాద్రి, జెల్ల సతీష్, తుమ్మల నాగరాజు రెడ్డి, అంతటి నాగరాజు, దేశగోని సాయి, పల్లపు ప్రశాంత్ పాల్గొన్నారు.



# కళ్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

- రూ. 10 లక్షల విరాళం

**ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 19:**

చిట్యాల పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నల్గొండ జిల్లా చిట్యాల లో కనకదుర్గ అమ్మవారి ఆలయం వారిచే నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. దీనికి సంకల్పించిన ఆలయ కమిటీ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ను ఎమ్మెల్యే అభినందించారు. తన వంతుగా నిర్మాణానికి రూ. 10 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. పనులను వేగవంతంగా చేపట్టి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, నాయకులు పోకల దేవదాసు, జడల చిన్న మల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు, పందిరి శ్రీనివాస్, పాటి మాధవరెడ్డి, ఎద్దులపురి కృష్ణ, బొబ్బల రామ్ రెడ్డి, గుడిపాటి లక్ష్మీనరసయ్య తదితరులతోపాటు ఆలయ కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, రుద్రారపు లింగస్వామి, వరకాంతం నరసింహారెడ్డి, జిట్టా సాయిలు, వనమా నిఖిల్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో చిట్యాల పట్టణంలోని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.



# మున్సిపల్ ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి దిశా నిర్దేశం

**ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 19:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. చిట్యాల మున్సిపాలిటీలో సోమవారం మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమిష్టిగా పనిచేసి గెలుపుకు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలోని వార్డుల వారీగా పలువురు ఇంచార్జిలను ఆయన నియమించారు. ప్రతి వార్డులో ఇంటింటి ప్రచారం ముమ్మరం చేయడంతో పాటు ప్రజా సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారంపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని, పార్టీపై ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే లింగయ్య సూచించారు.

# ఆర్గానిక్ పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్

- పసుపు బోర్డు తొలి వార్షికోత్సవ సభలో ఎం.పీ, కలెక్టర్ వెల్లడి
- సేంద్రీయ సాగుపై దృష్టి సారించాలని పసుపు రైతులకు పిలుపు
- ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని హామీ



**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 19 :**

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆర్గానిక్ పసుపు పంటకు విస్తృత స్థాయిలో డిమాండ్ ఉన్నందున సేంద్రీయ విధానంలో పసుపు పంట సాగుపై దృష్టిని కేంద్రీకరించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి, కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపునిచ్చారు. జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్ లో తొలి వార్షికోత్సవ సభ, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం.పీ అరవింద్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బోర్డు కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఐ.ఏ.ఎస్ అధికారిని ఎన్.భవానిశ్రీ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా పసుపు బోర్డు ద్వారా ఏడాది కాలంగా రైతులకు అందించిన తోడ్పాటు, చేపట్టిన కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బోర్డు చైర్మన్, కార్యదర్శులు వివరించారు. ఎం.పీ అరవింద్ మాట్లాడుతూ, పసుపు సాగులో నిజామాబాద్ జిల్లా ప్రత్యేకతను కలిగి ఉందని, మూడు దశాబ్దాలకు పైగా ఈ ప్రాంత రైతులు అలుపెరుగకుండా కొనసాగించిన పోరాటాలు, నిరవధిక కృషి ఫలితంగా జాతీయ పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏడాది క్రితం నిజామాబాద్ లో ఏర్పాటు చేసిందని అన్నారు. బోర్డు ఏర్పాటైన ఫలితంగా ఇక్కడి పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఏర్పడుతోందని, విదేశాలకు నిజామాబాద్ ప్రాంత పసుపు పంటను పరిచయం చేయడంలో బోర్డు సఫలీకృతం అయ్యిందని అన్నారు. మునుముందు బోర్డు ద్వారా పసుపు రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా చూస్తే పసుపు పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని అన్నారు. అయితే రైతులు ఆర్గానిక్ పసుపు పంటను సాగు చేస్తే మరింత డిమాండ్ ఉంటుందని ఎం.పీ సూచించారు. ఎన్ని వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసినా, ఆర్గానిక్ పసుపు పంటను మంచి డిమాండ్ తో కూడిన ధర పొందవచ్చని, ఈ మేరకు ట్రేడర్లను రప్పించే బాధ్యతను బోర్డు స్వీకరిస్తుందని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, పసుపు రైతుల సాధకబాధకాల గురించి తనకు స్పష్టమైన అవగాహన ఉందని, వారికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. రైతులు పురాతన సంప్రదాయ పద్ధతులకు బదులుగా, అందుబాటులోకి వచ్చిన ఆధునిక, సాంకేతిక విధానాలలో నాణ్యమైన పసుపు పంటను సాగు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఆధునిక యంత్ర పరికరాలను, నాణ్యమైన వంగడాలను వినియోగించడంతో పాటు, సేంద్రీయ విధానంలో పంటను సాగు చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంటుందని హితవు పలికారు. పసుపు ఎగుమతులను అంతర్జాతీయ స్థాయిలో జరిగేలా పసుపు బోర్డు విశేషంగా కృషి చేస్తోందని, రైతులు కూడా మరింత నాణ్యమైన పసుపు పంటను పండిస్తే మంచి మద్దతు ధర పొందవచ్చని సూచించారు. కేవలం పంట సాగుకే పరిమితం కాకుండా, పసుపు ప్రాసెసింగ్ విధానాలలోనూ శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలని, ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ దిశగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని, పసుపు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఉద్యానవ శాఖ సంయుక్త సంచాలకుడు శ్రీనివాస్ రావు, పసుపు బోర్డు అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.



# నగరంలో అభివృద్ధి పనులకు భూమి పూజ

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 19 :**

నగరంలో వివిధ డివిజన్ల లో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్త భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ అభివృద్ధి లక్ష్యంగా తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి తన నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తూ డివిజన్ కు రూ. కోటి చొప్పున రోడ్లు డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులకు భూమి పూజలు చేసినట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. టీయూఎఫ్ఐడీ సి పథకం ద్వారా నగరంలోని 19 డివిజన్ పరిధిలోని రోడ్ నెంబర్ 5 లో భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా 20 వ డివిజన్ ఎల్లమ్మ గుట్ట, 36వ డివిజన్ నాందేవ్ వాడ, 34 వ డివిజన్ మిర్చి కాంపౌండ్, 49వ డివిజన్ శ్రీదేవి టాకీస్ రోడ్డు, 50 డివిజన్ పరిధిలోని గురుద్వార్ దగ్గర, 27వ డివిజన్ పరిధిలోని వర్ని చౌరస్తా ప్రాంతాల్లో, 8 వ డివిజన్ పరిధిలోని బంగారు మైసమ్మ గుడి, సాయి నగర్ రోడ్ నెంబర్ 2, 46వ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ గల్లీ (పోచమ్మ గల్లి), 44వ డివిజన్ పరిధిలోని ఖలీల్ వాడి ప్రాంతాల్లో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో అర్బన్ నియోజకవర్గాన్ని దేశంలోనే కాకుండా రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాలలో పబ్లిక్ హెల్త్ డీఈ ఇంచార్జ్ నగేష్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎఈ లు శివకృష్ణ శంకర్ పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర నిందితుడి అరెస్ట్

- కత్తితో బెదిరించి పుస్తెల తాడు దోపిడీ చేసిన అంతరాష్ట్ర నిందితుడి అరెస్ట్
- నిందితుడి నుండి బైక్, కత్తి మరియు మొబైల్ స్వాధీనం – రిమాండ్‌కు తరలింపు
- సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కేసు ఛేదించిన బీర్కూర్ పోలీసులు

**ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 19:**

బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను కత్తితో బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన అంతరాష్ట్ర నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను బాన్సువాడ డిఎస్పీ బి. విఠల్ రెడ్డి వెల్లడించారు. గత నెల 2న బీర్కూర్ మండలం బారంగేడ్గి గ్రామానికి చెందిన బోయి అనూషబాయి మార్కెట్ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, ఒక గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను ఎక్కించుకున్నాడు. భైరపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో బైక్ ఆపి, తన వద్ద ఉన్న కత్తిని చూపి చంపుతానని బెదిరించాడు. ఆమె మెడలోని పుస్తెల తాడు, బంగారు గుండ్లు మరియు కెంపులను బలవంతంగా లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు, బాన్సువాడ డిఎస్పీ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు (CCS టీం, బాన్సువాడ రూరల్ సీఐ టీం, బీర్కూర్ ఎస్ఐ టీం) దర్యాప్తు చేపట్టాయి. ఘటనా స్థలంలోని సీసీ కెమెరాల ఫుటేజీని నిశితంగా విశ్లేషించి, నిందితుడు ఉపయోగించిన ద్విచక్ర వాహన నంబర్‌లోని కొన్ని అంకెలను గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడి కదలికలపై నిఘా ఉంచారు. తేదీ 18నాడు బీర్కూర్ కమాన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి పారిపోతున్న నిందితుడిని బీర్కూర్ ఎస్ఐ, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నాడు.

**నిందితుడు వివరాలు:**
హెగ్డోలే హన్మంత్ విఠల్ (S/o విఠల్), నివాసం: షెల్గావ్, డెగ్లూర్, నాందేడ్ జిల్లా (మహారాష్ట్ర).

**స్వాధీనం:** నేరానికి వాడిన ద్విచక్ర వాహనం, కత్తి, మఫ్లర్ మరియు ఒక మొబైల్ ఫోన్. సీసీ కెమెరాల సహాయంతో, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంతరాష్ట్ర నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ నబరిచిన బాన్సువాడ రూరల్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, బీర్కూర్ ఎస్ఐ ఎం. మహేందర్ వారి బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.






# ప్రజావాణి కి 75 దరఖాస్తులు

**ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 19:**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమం లో 75 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు విక్టర్, మధు మోహన్ సబ్ కలెక్టర్ కిరణ్మయి, RDO వీణ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



"ఏపీలో ఈ యేడాది డ్రోన్ టాక్సీ, డ్రోన్ అంబులెన్సులు తీసుకొస్తున్నాం. విశాఖకు రూ. వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఎన్నారైలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ. 50 కోట్ల కార్పస్ ఫండ్ ఇస్తాం. వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. బెస్ట్ వర్సిటీల్లో చదవాలనుకునే వారికి 4శాతం వడ్డీతో రునాలు ఇస్తాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం



# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**

సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో పుల్లూరు బండ జాతర, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి స్వామివారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, స్వామివారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పంట పొలాలు పాడి పశువులు చల్లగా ఉండాలని కోరారు.జాతర ఉత్సవాల నిర్వహణ కు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వంగ రాజేశ్వర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచం లత వెంకట్ యాదవ్, ఉప సర్పంచ్ ఒగ్గు రాజేష్,ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరి కనకయ్య, వార్డు సభ్యులు యోగి ప్రవీణ్,వైకుంతం, శ్రీను,సురేష్, రాజు,అనిల్, రాకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ప్రభుత్వ పథకాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడం సరికాదు*
- మున్సిపల్ 20వ వార్డు ఇన్చార్జ్ ఎండి షాబుద్దీన్



**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**

ఆపదలో ఉన్నవారికి అండగా ముఖ్యమంత్రి సహాయనిది నిలుస్తుందని, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని పట్టణ మున్సిపాలిటీ 20వ వార్డు ఇన్చార్జి ఎండి షాబుద్దీన్ అన్నారు. సోమవారం వార్డులోని సాజిత్ పురాలో నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసి పోయిన అప్పులను కట్టుకుంటూ, ప్రజల పెన్నిధిగా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న కూడా ఇప్పటికీ ప్రతిపక్ష లో ఉన్న నాయకులు ,మినిస్టర్లు ఫేక్ వార్తలు తయారు చేసుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.గతంలో కెసిఆర్ దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానన్న వాగ్దానం మర్చిపోయి అదే కుర్చీ మీద కూసున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ముస్లింలకు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని మాట మర్చిపోయిన మిమ్మల్ని ప్రజలందరూ గమనించి, అందుకే తుంగలో తొక్కి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డుకాంగ్రెస్ కాంగ్రెస్ కార్యకర్తలు మజీద్ ఖాన్ ఎండి జాంగిర్ ఎండి ఆరిఫ్ బబ్లు తదితరులు పాల్గొన్నారు



# అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ట రెండవ వార్షికోత్సవం ..

- సిద్దిపేటలో సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 19:**

అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట జరిగిన రెండవ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేటలో సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు లక్ష్మీనాథం తెలిపారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలో 39వ వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు, శివ్వ కాంప్లెక్స్, సుభాష్ రోడ్డు దుకాణాల సముదాయం ఆధ్వర్యంలో ఈబృహత్కార్యం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు కార్యక్రమ కరపత్రికను సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 గురువారం రోజున ఉదయం 10 గంటలకు సుభాష్ రోడ్ లోని శివ్వ కాంప్లెక్స్ ముందర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. కళ్యాణ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే సాంసృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో రామభక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు శరవయ్య, రవీందర్, చంద్రశేఖర్, మహేష్, చావల్ సింగ్ పలువురు పాల్గొన్నారు.



# పదవతరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- స్పీడప్ గా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరగాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 18:**

నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు సోమవారం పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు సేలబస్ ఎంత వరకు అయింది? ఎలా చదువుతున్నారు? హాజరు ఎలా ఉంది ? అని అడిగారు.సోషల్ మీడియా కు దూరంగా ఉండి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కొడపాక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పదవ తరగతి లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని ,విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టు లలో వెనకబడి ఉన్నారో తెలుసుకొని వారి పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కొడపాక గ్రామంలో నూతనంగా నిర్మింస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి ... నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ సంక్షేమ పాలనతో కాంగ్రెస్ కనుమరుగు

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**



గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం 'వీబీజీ రామ్ జీ' పథకం ప్రారంభమైందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు.సోమవారం సిద్దిపేట బిజెపి జిల్లా కార్యాలయం లో ఏర్పాటుచేసిన వీబీజీ రామ్ జీ కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఇది కేవలం ఉపాధి హామీ పథకం మాత్రమే కాదు,వికసిత భారత్ లక్ష్యాన్ని నెరవేర్చే ఒక గొప్ప సంకల్పం అని స్పష్టం చేశారు.కావాలని ప్రతిపక్షాలు ఈ పథకాన్ని విమర్శిస్తూన్నాయే తప్ప వారు చేసిందేమీ లేదన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం కొత్త చట్టాలు, పథకాలు అమలు చేస్తుంటే, రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతోందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు విమర్శించారు. ఇదే కారణంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయి కనుమరుగవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కాంగ్రెస్ పార్టీ వైఖరి, రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆయన పాలనను ప్రశంసించిన రఘునందన్ రావు, మోదీ పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక సంస్కరణాత్మక చట్టాలు తీసుకొచ్చారని అన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలకు నేరుగా లబ్ధి చేకూరేలా మోదీ ప్రభుత్వం విధానాలు అమలు చేస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకొస్తే వాటిని కాంగ్రెస్ పార్టీ రాజకీయ లాభాల కోసమే అడ్డుకుంటోందని విమర్శించారు. ఇదే కారణంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయి కనుమరుగవుతోందని వ్యాఖ్యానించారు. జాతీయ ఉపాధి హామీ పథకం విషయంలో మాట్లాడుతూ, గతంలో 100 పని దినాలు ఉన్న ఉపాధి హామీని మోదీ ప్రభుత్వం 125 రోజులకు పెంచిందని గుర్తు చేశారు. దీనివల్ల గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. ఈ నిర్ణయంతో కాంగ్రెస్ నాయకులకు ఏం నష్టం వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సుమారు 3 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయగా, మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలోనే భారీగా ఖర్చు చేసి పథకాన్ని బలోపేతం చేసిందని తెలిపారు. పథకాల అమలులో పారదర్శకత తీసుకురావడమే మోదీ ప్రభుత్వ ప్రత్యేకత అన్నారు. "విబీజీ రామ్ జీ" అనే పేరు కాంగ్రెస్ పార్టీని కలవరపెడుతోందని రఘునందన్ రావు అన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న రామరాజ్యం అనే భావన కాంగ్రెస్ నాయకులకు నచ్చడం లేదని విమర్శించారు. గాంధీజీ సమాధిపై ఉన్న "హే రామ్" అనే పదం కూడా వారికి ఇష్టం లేదని, మహాత్మా గాంధీ ఆశయాలకు కాంగ్రెస్ పార్టీ దూరమైందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ మైండ్ పూర్తిగా సంకుచితమైందని, సమాజ మార్పు కోసం "విబీజీ రామ్ జీ" అనే పేరును పెట్టామని తెలిపారు. ఇది సామాజిక మార్పు, జాతీయ ఐక్యతకు ప్రతీకగా ఉంటుందన్నారు.రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల పాలనలో ఒక్క మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 15వ ఫైనాన్స్ కమిషన్ కింద నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనను గుర్తించి బీజేపీకి మద్దతు ఇస్తారని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఎక్కడా అధికారంలో లేదని పేర్కొంటూ, ఓటర్లు ఈ విషయాన్ని గమనించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, నాయకులు వంగ రామచంద్రారెడ్డి, గుండ్ల జనార్దన్ , తోడుపునూరి వెంకటేశం, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు సేవ చేయడం సర్పంచులకు దేవుడు ఇచ్చిన సువర్ణావకాశం

- జిల్లా కలెక్టర్ హైమవతి
- నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ప్రారంభం..

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**



గ్రామీణ ప్రజలకు సేవ చేయడం సర్పంచులకు దేవుడు ఇచ్చిన సువర్ణావకాశమని జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు.సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (NAC సెంటర్) లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్జీఎస్ఏ, టీజీఐఆర్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.జిల్లా కలెక్టర్ కె. హైమావతి జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ ఐదు రోజుల పాటు కొనసాగనుండగా, గ్రామపంచాయతీ పరిపాలన విధానం, విధులు, బాధ్యతలపై అధికారులచే సర్పంచులకు అవగాహన కల్పించనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్రాగునీరు, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలకు వచ్చే పన్నులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.

వార్డు సభ్యుల సహకారంతో పంచాయతీ తీర్మానాల ప్రకారం పారదర్శకంగా పనిచేయాలని, మహిళా సర్పంచులు స్వయంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ గ్రామాలుగా నిలవాలంటే ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ట్రైనీ డీపీఓ వినోద్ కుమార్, అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నీటిని వెంటనే విడుదల చేయాలి

- చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19:**



రంగనాయక సాగర్ ద్వారా కాళేశ్వరం నీటిని వెంటనే విడుదల చేయాలనీ చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యులు హరీష్ రావు పంట కాలానికి ముందుగానే, వరి నాట్లు ప్రారంభమయ్యేలోపే కాలువల ద్వారా నీటిని విడుదల చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పంటలు పండేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వెంటనే రంగనాయక సాగర్ ద్వారా కాళేశ్వరం నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మండలంలో అనేక గ్రామాల్లో మధ్యలో ఆగిపోయిన పంట కాలువల నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, తక్షణమే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని కోరారు. అలాగే చంద్లపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల విద్యుత్తు సరఫరా కల్పించి వ్యవసాయ పొలాలకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులకు సకాలంలో యూరియా ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతు బీమా విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గత రెండేళ్లుగా ఒక్క రైతుకైనా రైతు బీమా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. అలాగే రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.చెరువుల్లో వెంటనే చేప పిల్లలను విడుదల చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కూడా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పంపరి కనకయ్య, ఫాక్స్ మాజీ చైర్మన్ ములకల కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, జంగిటి శ్రీనివాస్, ములకల కుంటయ్య,తదితరులు పాల్గొన్నారు.




# ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ

- చట్టపరంగా న్యాయం అందిస్తాం
- పోలీసులపై పెరుగుతున్న విశ్వాసం
- ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 18 :-**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం పనిచేయాలని మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు సోమవారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి ప్రజా సమస్యలను దరఖాస్తు రూపంలో నేరుగా తీసుకున్నారు వారి సమస్యలను వింటూ వారికి సమస్యలను పరిష్కరించే విధంగా ధైర్యం చెబుతూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు తెలియజేశాడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని ఎస్పీ పేర్కొన్నారు.

# సిద్దిపేటలో కుటుంబ కలహాలు

- భార్య హత్య, కూతురుపై దాడి..

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 19**



సిద్దిపేట పట్టణంలోని ఆదర్శ నగర్‌లో కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త భార్యను హత్య చేసిన దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త ఎల్లయ్య (38) ముందుగా పురుగుల మందు తాగించాడు. అయితే ఆమె చనిపోకపోవడంతో, గొంతు కోసి హత్య చేసినట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కూతురు అర్చిత (11)పై రోకలి బండతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. కొడుకుపై కూడా దాడికి యత్నించగా, అతడు తప్పించుకుని బయటకు పారిపోయినట్లు తెలిపారు. భయంతో భర్త ఎల్లయ్య తన గొంతు కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన ఎల్లయ్యతో పాటు కూతురు అర్చితను హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో భార్య శ్రీలత (32) మృతి చెందింది. ఈ కుటుంబం 15 రోజుల క్రితమే హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చినట్లు, సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం దేక్కల్ గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. గతంలో కూడా చిన్న చిన్న తగాదాలు జరిగాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే సిద్దిపేటలో ఒక ఫ్లాట్ కొనుగోలు చేసినట్లు బంధువులు చెప్పారు. కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామని ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు. ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

"



మంత్రులు, మహిళా అధికారులపై నిందలు మోపడం కరెక్ట్ కాదు. మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం తప్పు. ఆడవాళ్లు ఏం వేసుకోవాలో మీరెలా డిసైడ్ చేస్తారు. ఇలాంటి రూల్స్ మీ ఇంట్లో వాళ్లకి పెట్టుకోండి.

\- కాంగ్రెస్ నేత, ఎంపీ రేణుకా చౌదరి

సింగిడి
హైదరాబాద్
మంగళవారం
20.01.2026
9
ప్రతిపక్షం
Prathipaksham.in

## స్పెయిన్ రైలు ప్రమాదంలో 39కి చేరిన మృతుల సంఖ్య



స్పెయిన్‌లో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న) ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. ఇంకా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. దక్షిణ స్పెయిన్‌లోని అడముజ్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. మాడ్రిడ్‌కు వెళ్తున్న ఓ రైలు పట్టాలు తప్పి, మరో మార్గానికి చెందిన పట్టాలపై పడిపోయింది. దీంతో ఆ ట్రాక్‌పై వస్తున్న ఓ రైలును ఢీకొట్టింది. ఆదివారం రాత్రి ఏడున్నర సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో మృతిచెందిన, గాయపడిన వారిలో ఎక్కువ ముందు బోగీల్లో వారున్ఏనారు. మాడ్రిడ్ నుంచి హుల్వేకు వెళ్తున్నరైలులో తీవ్ర నష్టం జరిగింది. ప్రమాదం చాలా తీవ్రంగా ఉన్నట్లు రవాణాశాఖ మంత్రి ఆస్కార్ పెంట్ వెల్లడించారు. అడముజ్ పట్టణంలో స్పానిష్ రెడ్ క్రాస్ ఓ హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. భద్రతా సిబ్బంది రాత్రంతా ప్రమాద ప్రాంతంలో రెస్క్యూ చర్యలు చేపట్టాయి.రెండు రైళ్లలో కలిపి మొత్తం 400 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. ఎమర్జెన్సీ సిబ్బంది సుమారు 122 మందికి చికిత్స అందించారు.

## విశ్వ వీక్షణం



## బీజేపీ తీరుపై రాహుల్ ధ్వజం..

ఆర్ఎస్ఎస్, బీజేపీపై మళ్లీ విమర్శలు చేశారు రాహుల్ గాంధీ . దేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కేరళలోని కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇవాళ ప్రసంగించారు. తమ పార్టీ వికేంద్రీకరణను విశ్వసిస్తుందన్నారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ 73, 74వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు.రాజ్యాంగాన్ని పరిరక్షించడం అంటే గ్రామీణ స్థాయిలో పరిపాలనను వికేంద్రీకరించడం అవుతుందని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో నిశబ్ద సంస్కృతి పెరుగుతోందని, దీని పట్ల జాగ్రత్తగా ఉండాలని మలయాళ రచయిత ఎం లీలావతి హెచ్చరించినట్లు కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే కొందరు కార్పొరేట్లు దేశ సంపదను నియంత్రించే అవకాశం ఉంటుందని బీజేపీ విశ్వసిస్తుందని ఆయన ఆరోపించారు. కేరళ ప్రజల నోటిని నొక్కలేమని, ఎన్నికల ద్వారా సమాధానం ఇవ్వాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.



# ఐరన్ లోపానికి చెక్ పెట్టే సూపర్ డ్రింక్స్!

వయసుతో సంబంధం లేకుండా మన శరీరానికి అవసరమయ్యే పోషకాల్లో ఐరన్ కూడా ఒకటి. శరీరంలో తక్కువగా ఉండే ఐరన్ స్థాయిలు హిమోగ్లోబిన్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఇది రక్తహీనతకు దారి తీయవచ్చు. శరీరంలో ఐరన్ తక్కువగా ఉండడం వల్ల రక్తహీనతతో పాటు మనం అనేక ఇతర అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. కనుక మనం రోజూ తీసుకునే ఆహారంలో ఐరన్ ఉండేలా చూసుకోవడం చాలా అవసరం. అయితే ఐరన్ ఉండే ఆహారాలను ఉడికించి తీసుకోవడమే కాకుండా వాటిని జ్యూస్‌గా చేసి కూడా తీసుకోవచ్చు. అలాగే విటమిన్ సి ఉండే జ్యూస్ లను తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. ఐరన్ స్థాయిలను పెంచే విటమిన్ సి జ్యూస్ లను ఎలా తయారు చేసుకోవాలో పోషకాహార వైద్యులు వివరిస్తున్నారు.

### దోసకాయ, కాలే, పాలకూర జ్యూస్..

ఐరన్ లోపాన్ని తగ్గించడంలో పాలకూర మనకు ఎంతో సహాయపడుతుంది. దీనిలో ఐరన్ తో పాటు విటమిన్ బి6, బి2, కె, ఇ, సి వంటి పోషకాలు ఎన్నో ఉన్నాయి. కాలే ఆకులను జత చేయడం వల్ల ఈ జ్యూస్ కు మంచి రుచి వస్తుంది. ఈ జ్యూస్ ను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన విటమిన్ సి తో పాటు ఐరన్ కూడా అందుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. ఇక విటమిన్ సి అనగానే మనకు ముందుకు గుర్తుకు వచ్చేది నారింజ పండు. దీనిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల మనం తినే ఆహారాలలో ఉండే ఐరన్ ను మన శరీరం ఎక్కువగా గ్రహిస్తుంది. తద్వారా ఐరన్ లోపం తగ్గుతుంది. ఈ జ్యూస్ ను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.


### పైనాపిల్, నారింజ రసం..

పైనాపిల్, నారింజ, ఆనపకాయను కలిపి జ్యూస్‌గా చేసి తీసుకోవడం వల్ల శరీరంలో విటమిన్ సి లోపం లేకుండా ఉంటుంది. శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంటుంది. ఈ జ్యూస్ నేరుగా శరీరానికి ఐరన్ ను అందించకపోయినా ఈ జ్యూస్ ను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ స్థాయిలు తగ్గకుండా ఉంటాయి. అంతేకాకుండా ఈ జ్యూస్ ను తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. బీట్ రూట్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల శరీరానికి విటమిన్ సితో పాటు ఐరన్ కూడా అందుతుంది. బీట్‌రూట్ జ్యూస్ ను నేరుగా చేసి తీసుకోవడంతో పాటు దీనిలో మిరియాలు, ఉప్పు, బెర్రీలు వంటి వాటిని కలిపి బీట్‌రూట్ షాట్స్ చేసి కూడా తీసుకోవచ్చు. ఈ జ్యూస్ చాలా రుచిగా ఉంటుంది. కనుక దీనిని పిల్లలు కూడా ఇష్టంగా తాగుతారు. ఈ షాట్స్ ను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది.

### పుచ్చకాయ, దానిమ్మ రసం..

పుచ్చకాయను, దానిమ్మను మన ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ లోపం రాకుండా ఉంటుంది. పుచ్చకాయలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను మెరుగుపరచడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. జార్‌లో పుచ్చకాయ ముక్కలు, దానిమ్మ గింజలు, పుదీనా ఆకులు వేసి జ్యూస్ గా చేసుకోవాలి. తరువాత ఇందులో రుచికి తేనె, నిమ్మరసం, ఉప్పు వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. అరటిపండులో విటమిన్ సి తో పాటు ఐరన్ కూడా ఉంటుంది. దీనిని నేరుగా తినడం కంటే జ్యూస్‌గా తీసుకోవడానికే చాలా మంది ఇష్టపడతారు. అరటి పండు, తేనె, గుమ్మడి గింజలు కలిపి స్మూతీలాగా చేసి తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. శరీరంలో విటమిన్ సి, ఐరన్ లోపాలు రాకుండా ఉంటాయి.





### స్ట్రాబెర్రీ, అరటిపండు స్మూతీ..

స్ట్రాబెర్రీలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, అరటిపండు స్మూతీ చేసి తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు. జార్ లో కాచి చల్లార్చిన పాలు, అరటిపండు, తేనె, స్ట్రాబెర్రీలు వేసి స్మూతీ లాగా చేసుకోవాలి. తరువాత ఐస్ లేదా పుదీనా ఆకులతో గార్నిష్ చేసి తీసుకోవచ్చు. ఐరన్ లోపంతో బాధపడే వారు తరుచూ ఐరన్, విటమిన్ సి ఉండే ఆహారాలను ఉడికించి తీసుకోవడానికి బదులుగా ఇలా జ్యూస్ ల రూపంలో కూడా తీసుకోవచ్చు. ఇలా తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు. ఐరన్ లోపంతో బాధపడే వారు ఇప్పుడు చెప్పిన జ్యూస్ లను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.





## ఉన్నావ్ అత్యాచార కేసులో హైకోర్టు కీలక తీర్పు

2017లో ఉత్తర్‌ప్రదేశ్ లోని ఉన్నావ్ లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో సెంగార్ పిటిషన్ వేశాడు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఢిల్లీ న్యాయస్థానం.. ఆ పిటిషన్ను కొట్టివేసింది. 'రిలీఫ్ మంజూరు చేయడానికి నిందితుని తరఫు న్యాయవాదులు ఎలాంటి కారణాలూ చూపలేదు. శిక్షను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన వాజ్యాన్ని తిరస్కరిస్తున్నాం' అని జస్టిస్ రవీందర్ దుడేజా స్పష్టం చేశారు.ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో ట్రయల్ కోర్టు 2020 మార్చి 13న సెంగార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని హతమార్చినందుకు దోషి విషయంలో ఎలాంటి సానుభూతీ చూపలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో కుల్దీప్ సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ సెంగార్‌తో పాటు మరో ఐదుగురికీ పదేళ్ల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సెంగార్ అండతో పోలీసులు.. బాధితురాలి తండ్రిని హింసించారు. చివరకు ఆయన.. 2018 ఏప్రిల్ 9న మరణించాడు.ఈ అత్యాచార కేసులో నిందితునికి జీవితాంతం జైలుశిక్ష విధించిన డిసెంబర్ 2019 నాటి తీర్పునకు వ్యతిరేకంగా.. అలాగే బాధితురాలి తండ్రి కేసులోనూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచార కేసులో తనపై విధించిన శిక్ష, తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో 2025 డిసెంబర్ 23న హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సీబీఐ స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది. ఈ పిటిషన్‌ను 2025 డిసెంబర్ 29న విచారించిన సుప్రీం న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం.



## కాబూల్ హోటల్‌లో పేలుడు..

- ఏడుగురు మృతి, పలువురికి గాయాలు

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక హోటల్‌లో బాంబు పేలుడు జరిగింది. ఈ సంఘటనలో ఏడుగురు మరణించారు. చాలా మంది గాయపడినట్లు తాలిబన్ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం కాబూల్‌లోని షహర్‌ఎనావ్‌లో ఒక హోటల్‌లో పేలుడు సంభవించినట్లు పేర్కొంది. ఉగ్రవాద ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ స్థానిక విభాగం ఈ పేలుడుకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేసింది.
కాగా, సురక్షితమైన, విదేశీ పౌరులు నివసించే షహర్‌ఎనావ్‌లోని చైనీస్ హోటల్‌లో ఈ పేలుడు జరుగడం కలకలం రేపింది. చాలా మంది మరణించారని, పలువురు గాయపడినట్లు తాలిబాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అబ్దుల్ మతీన్ ఖానీ ఒక వార్తా సంస్థకు తెలిపారు. మరిన్ని వివరాలు తర్వాత అందజేస్తామని చెప్పారు. అయితే ఈ పేలుడుకు సంబంధించిన వీడియోలను అంతర్జాతీయ వార్తా సంస్థలు ప్రసారం చేశాయి.



# ఆర్సీబీ జోరు.. ప్లే ఆఫ్స్ చేరు

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తున్న బెంగళూరు.. రెండో దఫాకూడా గుజరాత్ జెయింట్స్‌ను బెంబేలెత్తించింది. 178 పరుగుల ఛేదనలో సయాలీ సత్ఘరే(21 3) విజృంభణతో గుజరాత్ టాపార్డర్ కుప్పకూలింది. ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 117కే పరిమితమైంది. 61 పరుగుల తేడాతో జయభేరి మోగించిన మంధాన బృందం దర్జాగా ప్లే ఆఫ్స్‌లో అడుగు పెట్టింది.డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది. టాప్ గేర్ ఆటతో ప్రత్యర్థులను వణికిస్తున్న ఆర్సీబీ ఐదో విక్టరీతో ప్లే ఆఫ్స్ చేరింది. ఈ సీజన్‌లోనాకౌట్ దశకు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. సోమవారం వడోదరలో గౌతమీ నాయక్(73) అర్ధ శతకంతో 178 రన్స్ చేసిన బెంగళూరు.. మరోసారి గుజరాత్‌ను చిత్తుగా ఓడించింది. భారీ ఛేదనకు దిగిన గుజరాత్‌కు షాకిస్తూ ఓపెనర్ బేత్ మూనీ(3)ని బౌల్డ్ చేసిన సయాలీ సత్కరే(216).. ఐదో బంతికి సోఫీ డెవినె(0)ను వెనక్కి పంపింది.టాస్ ఓడిన ఆర్సీబీకి షాకిస్తూ గుజరాత్ జెయింట్స్ బౌలర్లు ఆరంభంలోనే వికెట్లు తీసినా ఆర్సీబీ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(1)ను మొదటి ఓవర్లోనే రేణుకా సింగ్ వెనక్కి పంపింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే డేంజరస్ జార్జియా వోల్ (1)ను కష్వీ గౌతమ్ క్లీన్ బౌల్డ్ చేసింది. దాంతో.. పరుగులకే ఆర్సీబీ విధ్వంసక ప్లేయర్లు డగౌట్ చేరారు. అనంతరం కెప్టెన్ స్మృతి మంధాన(26), గౌతమీ నాయక్(73)లు కీలక భాగస్వామ్యం నిర్మించారు. మంధానను ఎల్బీగా ఔట్ చేసిన గార్డ్‌నర్ ఈ ఈ జోడీని గార్డ్‌నర్ విడదీసింది.ఆ తర్వాత రీచా ఘోష్(27) జతగా ఆర్సీబీ స్కోర్ బోర్డును నడిపించిన గౌతమి హాఫ్ సెంచరీ సాధించింది. కాసేపటికే రీచా పెద్ద షాట్ ఆడబోయి బౌండరీ వద్ద గార్డ్‌నర్ చేతికి క్యాచ్ ఇచ్చింది. అనంతరం రాధా యాదవ్(17) డెవినె ఓవర్లో భారీ సిక్సర్‌తో స్కోర్ 160 దాటింది. కష్వీ వేసిన ఆఖరి ఓవర్లో తొలి బంతినే కవర్స్‌లో రాధ బౌండరీకి పంపింది. రెండో బంతికి ఫోర్ బాదిన తను ఔటయ్యాక వచ్చిన శ్రేయాంక పాటిల్ (8 నాటౌట్) స్వీప్ షాట్‌తో ఫోర్ సాధించగా 17 రన్స్ వచ్చాయి. ఫలితంగా ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 కొట్టింది.





# బంగ్లాదేశ్‌కు ఐసీసీ అల్టిమేటం

పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాలని పట్టుపట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ బోర్డు ప్రతిపాదించిన 'గ్రూప్ స్వాపింగ్‌కు' అంగీకరించమని క్రికెట్ ఐర్లాండ్ స్పష్టం చేయడమే ఆలస్యం.. భారత్‌లోనే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) ఆదేశించింది. కాదు.. కుదరదు అని బెట్టు చేస్తే కొత్త జట్టుకు అవకాశమిస్తామని బంగ్లా బోర్డును ఐసీసీ హెచ్చరించింది. అంతేకాదు ఆడుతారా? టోర్నీ నుంచి తప్పించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది.భద్రతా కారణాలరీత్యా భారత్‌లో ప్రపంచకప్ ఆడకుండా ఉండేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(BCB) చేస్తున్న ప్రయత్నాలు అన్నీ బెడిసి కొడుతున్నాయి. ఒక్కొక్కటిగా బంగ్లా బోర్డుకు అన్ని దారులు మూసుకుపోతున్నాయి. గ్రూప్ స్వాపింగ్ చేయాలని ఐసీసీకి విన్నవించుకున్నా నిరాశే ఎదురైంది. ఎందుకంటే.. తమను గ్రూప్ బీలోకి మార్చాలని అభ్యర్థించిన బంగ్లాదేశ్ ఆశలపై క్రికెట్ ఐర్లాండ్ నీళ్లు చల్లింది. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రూప్ మారబోమని, శ్రీలంకలోనే తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఆదివారం ఐర్లాండ్ స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో బంగ్లా బోర్డుకు మరో అవకాశమిచ్చింది ఐసీసీ. భారత్‌లోనే ప్రపంచకప్ ఆడాలని బంగ్లాకు స్పష్టం చేసింది. అందుకు అంగీకరించకుంటే.. ఏకంగా టోర్నీ నుంచే తప్పిస్తామని ఆ దేశ బోర్డును ఐసీసీ హెచ్చరించింది. మంకుపట్టు వదిలేసి ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడుతారా? టోర్నీనుంచి తొలగించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోండి. జనవరి 21 వరకూ మీ నిర్ణయాన్ని తెలియజేయాలని బంగ్లా బోర్డుకు స్పష్టం చేసింది ఐసీసీ. దాంతో.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న బీసీబీ సభ్యులు 'అయ్యో.. ఇలా జరిగిందేంటీ?' అని తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఐసీసీ హెచ్చరికను బంగ్లాబోర్డు బేఖాతరు చేస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం దక్కనుందని సమాచారం.క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. శనివారం ఐసీసీ ప్రతినిధులు ఢాకాలో బంగ్లాదేశ్ బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో ఆడకూడదనే నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఐసీసీ బృందం నచ్చజెప్పాలని చూసింది. కానీ, బంగ్లా బోర్డు మెంబర్స్ మాత్రం అందుకు అంగీకరించలేదు. శ్రీలంకలో ఆడేందుకు వీలు కల్పించేలా తమ జట్టును గ్రూప్ సీ నుంచి గ్రూప్ బీలోకి మార్చాలని ఐసీసీ సభ్యలను వారు కోరారు. పొట్టి ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం ప్రస్తుతం గ్రూప్ 'సీ'లో ఉన్న బంగ్లాదేశ్ లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు కోల్‌కతాలో ఆడాల్సి ఉంది. నాలుగో మ్యాచ్ ముంబైలో ఉంది. ఇక గ్రూప్ 'బీ'లోని ఐర్లాండ్ కొలంబోలో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడనుంది.



# ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

# ఫీల్డింగ్ వైఫల్యమే టీమ్ఇండియా ఓటమికి కారణం



న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను టీమ్ఇండియా 1-2తో కోల్పోయింది. ఇండోర్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక పోరులో భారత్ 41 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. స్వదేశంలో సిరీస్‌ను చేజార్చుకోవడంతో భారత జట్టుపై విమర్శలు వస్తున్నాయి. మూడో వన్డేలో భారత్ ఓడిపోవడానికి బ్యాటర్లు, బౌలర్లు కారణం కాదని.. ఫీల్డింగ్ వైఫల్యం వల్లే టీమ్ఇండియా ఓడిందని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. మిడిల్ ఓవర్లలో న్యూజిలాండ్ బ్యాటర్లు సులభంగా సింగిల్స్ తీయడంతో బౌలర్లకు ఇబ్బందికరంగా మారిందన్నారు. 'నేను ఎవరి పేర్లు చెప్పదలుచుకోలేదు. కానీ, కొంతమంది ప్లేయర్లు సింగిల్స్‌ను చాలా తేలికగా తీసుకోవడానికి అనుమతించారు. రోహిత్ శర్మ మైదానంలో చురుగ్గా ఉన్నాడు. కోహ్లీ గ్రౌండ్‌లో ఎంత వేగంగా ఉంటాడో మనందరికీ తెలుసు. కానీ, ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఫీల్డింగ్ మరింత చురుగ్గా ఉంటే బాగుండేదని నాకు అనిపించింది. మన ఫీల్డర్లు ప్రభావవంతంగా ఫీల్డింగ్ చేయకపోవడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు సులభంగా సింగిల్స్ తీశారు. దీంతో బౌలర్లపై ఒత్తిడి పెరిగింది. మన ఫీల్డింగ్ వైఫల్యంతో డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ వంటి ప్లేయర్లు క్రీజులో పాతుకుపోయి అవసరమైన రన్స్‌ను తీసుకుకొండా పరుగులు రాబట్టారు' అని గావస్కర్ విశ్లేషించారు. మిచెల్, ఫిలిప్స్ మూడో వికెట్‌కు 219 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. 338 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (124), నితీశ్ రెడ్డి (53), హర్షిత్ రాణా (52) పోరాడినా టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు.






# తగ్గనంటున్న శర్వా దూకుడు..

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ రన్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా సూపర్ స్టార్ట్ తీసుకుంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే యూఎస్ బాక్సాఫీస్ వద్ద 600K డాలర్లకు పైగా గ్రాస్ సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేసుకుని వచ్చిన ఈ ఎంటర్‌టైనర్ అక్కడి ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది.ట్రయాంగిల్ లవ్ స్టోరీగా వచ్చిన ఈ సినిమాలోని కామెడీ, రిలేషన్‌షిప్ డ్రామా మిక్స్ ప్రేక్షకులను మెప్పిస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథగా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయింది. ఇక ఈ సినిమాకు ప్రేక్షకులు పట్టం కడుతుండటం విశేషం.ఈ సినిమాలో అందాల భామలు సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించగా రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఈ సినిమాను ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర ప్రొడ్యూస్ చేశారు.

# డార్లింగ్ ఇమేజ్ మారిపోతుందా?




చిన్న హీరోలు, మీడియం రేంజ్ హీరోలు ఏ సినిమా అయినా చేయవచ్చు, ఎలాంటి పాత్రల్లో అయినా నటించవచ్చు. కానీ ఒక స్టార్ హీరో, క్రేజ్ ఉన్న హీరో, ఆకాశమే హద్దు అన్నట్లుగా ఇమేజ్ ఉన్న హీరో ఏ పాత్రను పడితే ఆ పాత్రను చేయడానికి వీలు లేదు. ఒక వేళ అలా చేస్తే కచ్చితంగా ఫ్యాన్స్ నుంచి, ప్రేక్షకుల నుంచి తిరస్కరణ ఎదుర్కొన్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఒకవేళ హీరో ఇమేజ్ ను పూర్తిగా పక్కన పెట్టి సినిమా చేయాలి అంటే కంటెంట్ అద్భుతంగా ఉండాలి, దర్శకుడు ప్రతిభావంతుడు అయ్యి ఉండాలి. ఆ ఇమేజ్ ను డామినేట్ చేసే విధంగా కంటెంట్ ఉన్నప్పుడు మాత్రమే ప్రేక్షకులు ఆ హీరోను మరోలా చూసేందుకు ఒప్పుకుంటారు. ఇప్పుడు ప్రభాస్ ను దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తనదైన శైలిలో చూపించేందుకు రెడీ అయ్యాడు. స్పిరిట్ సినిమా ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రభాస్ ఫ్యాన్స్‌లో ఒకరకమైన ఆందోళన కలిగిస్తోంది.ప్రభాస్ హీరోగా ఇప్పటి వరకు చేసిన సినిమాలు మొత్తం ఒక ఎత్తు అయితే, స్పిరిట్ సినిమా ఒక ఎత్తు అన్నట్లుగా ఉండబోతుంది. ప్రభాస్ అనగానే మృదు స్వభావి, ఆయన చాలా కామ్ గోయింగ్, క్యూట్ పర్సన్ అనే అభిప్రాయం ఉంటుంది. అలాంటి వ్యక్తి అలాంటి పాత్రల్లో నటిస్తేనే బాగుంటుంది. వ్యక్తిగతంగా ఒక రకమైన వ్యక్తిని సినిమాలో మరో రకంగా చూపించే ప్రయత్నం చేస్తే కొన్ని సార్లు మిస్ ఫైర్ అయ్యే ప్రమాదం ఉంది. ప్రభాస్ వ్యక్తిగతం కు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ యొక్క హీరోల ప్రవర్తనకు పూర్తి విభిన్నంగా ఉంటుంది. సందీప్ రెడ్డి సినిమాల్లో హీరోలను చూసి కొన్ని సార్లు బాబోయ్ మరీ ఇంత బోల్డ్‌గా జనాలు ఉంటారా.. మరీ ఇలా పచ్చిగా బూతులు మాట్లాడుతారా అనే అభిప్రాయం కలుగుతుంది. సందీప్ మరీ హద్దులు దాటి మరీ బూతులు మాట్లాడిస్తున్నాడు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్న వారు ఉన్నారు. ఇప్పుడు వారంతా కూడా ప్రభాస్‌తో సందీప్ ఎలాంటి డైలాగ్స్ చెప్పిస్తాడో అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.యానిమల్ సినిమాతో పాటు సందీప్ అంతకు ముందు చేసిన సినిమాలోనూ హీరో పాత్రను బోల్డ్‌గా డిజైన్ చేయడంతో పాటు, చాలా సీన్స్ ను పెద్దలకు మాత్రమే అన్నట్లుగా చేయడం జరిగింది. ప్రభాస్ సినిమా అంటే అందరూ చూసే విధంగా ఉండాలి అనేది చాలా మంది అభిప్రాయం. కానీ సందీప్ చేస్తే ప్రభాస్ సినిమాను అందరూ చూడలేరేమో అనే అనుమానం కలుగుతోంది. ప్రభాస్ వంటి సాఫ్ట్ యాక్టర్ ను యానిమల్ సినిమాలో రణబీర్ కపూర్ మాదిరిగా చూపిస్తే తెలుగు ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఏ భాషకు చెందిన ప్రేక్షకులు కూడా ఒప్పుకోకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రభాస్ వంటి క్యూట్ హీరో ను చాలా రఫ్‌గా, హీరోయిన్‌తో రొమాంటిక్ సీన్స్ లో చూపించడం వల్ల ప్రేక్షకులు కూడా కచ్చితంగా ఇబ్బంది ఫీల్ అయ్యే అవకాశం ఉంది అనేది విశ్లేషకుల అభిప్రాయం.సినిమాలోని కథ, కంటెంట్ బలంగా ఉంటే ప్రభాస్ అలా చేశాడు ఏంటి, మరీ ఇలా మాట్లాడాడు ఏంటి అనేది జనాలు పట్టించుకోరు అనేది సందీప్ వాదన. అందుకే ఆయన యానిమల్ సినిమాలో రణబీర్ కపూర్‌తో ఎలాంటి డైలాగ్‌లు చెప్పించాడో, ఎలాంటి సీన్స్ లో నటింపజేశాడో అలాంటి సీన్స్, అలాంటి డైలాగ్స్ ను ప్రభాస్ తో చెప్పించడం ఖాయం. అయితే ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారు అనేది ఇప్పటికీ కొందరు అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న. ప్రభాస్ సలార్ సినిమా సైతం ఫ్యామిలీ ఆడియన్స్ వచ్చి చూసే విధంగా ఉండదని, కనుక స్పిరిట్ సినిమా విషయంలో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అనేది ఇండస్ట్రీ వర్గాల వారు చెందరు చెబుతున్న విశ్లేషణ. మొత్తానికి ప్రభాస్ స్పిరిట్ సినిమా యూత్ ను ఓ రేంజ్ లో ఊపడం ఖాయం. ఈ సినిమాతో ప్రభాస్ ఇమేజ్ కూడా మారినా ఆశ్చర్యం లేదు. రాజాసాబ్ నిరుత్సాహ పరిచిన స్పిరిట్ అన్నింటికి సమాధానం చెప్పబోతుంది అని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.



# 'అనగనగా ఒక రాజు' సక్సెస్ లో ఐటెం సాంగ్ లోటు..

నవీన్ పొలిశెట్టి లీడ్ రోల్ లో అతని డైలాగ్స్, స్క్రీన్ ప్లే లోనే వచ్చిన సినిమా అనగనగా ఒక రాజు. సంక్రాంతి సినిమాల పండగలో తను కూడా జాయిన్ అయ్యి ప్రేక్షకులకు ఒక మంచి ఆహ్లాదకరమైన ఎంటర్టైనింగ్ సినిమా ఇచ్చాడు నవీన్ పొలిశెట్టి. పేరుకి మారి అని డైరెక్టర్ ని పెట్టినా సరే ఈ సినిమా విషయంలో అన్నీ తానై నడిపించాడు నవీన్ పొలిశెట్టి. అందుకే ఈ సినిమా సక్సెస్ విషయంలో ఎక్కువ క్రెడిట్ ఆయనకే దక్కుతుంది.ఐతే సితార ఎంటర్టైన్ మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ కలిసి నిర్మించిన అనగనగా ఒక రాజు సినిమాలో నవీన్ పొలిశెట్టి సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందించిన ఈ సినిమాలో భీమవరం బాల్మా సాంగ్ రిలీజ్ ముందే బాగా ఎక్కేసింది. రాజు గారి పెళ్లిరో సాంగ్ కూడా ప్రేక్షకులను అలరించింది. ఐతే సితార బ్యానర్ లో స్పెషల్ ఐటెం సాంగ్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. మాస్ ఆడియన్స్ ని మెప్పించేలా ఈ సాంగ్స్ ఉంటాయి.గుంటూరు కారం లో కుర్చీ మడతపెట్టి సాంగ్ రాగా.. సితార నుంచి వచ్చిన మ్యాడ్, మ్యాడ్ 2 లో కూడా స్పెషల్ సాంగ్స్ ఆకట్టుకున్నాయి. కానీ సంక్రాంతికి వచ్చిన అనగనగా ఒక రాజు సినిమాలో ఆంధ్రా టు తెలంగాణ సాంగ్ మాత్రం ఇంప్రెస్ చేయలేకపోయింది. అనగనగా ఒక రాజు సినిమా ప్రేక్షకులను సూపర్ ఎంటర్టైన్ చేసినా ఈ సాంగ్ విషయంలో మాత్రం కాస్త నిరుత్సాహ పరిచింది. సినిమాలోనే కాదు ఈ సాంగ్ యూట్యూబ్ లో కూడా ఆడియన్స్ పెద్దగా పట్టించుకోలేదు.మిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందించిన ఆంధ్రా టు తెలంగాణ సాంగ్ ని శాన్వీ మేఘన గ్లామర్ షోతో అలరించే ప్రయత్నం చేసింది. ఐతే మామూలుగా అయితే స్పెషల్ ఐటెం సాంగ్స్ ఏవైనా మాస్ ఆడియన్స్ కి వెంటనే ఎక్కేస్తాయి. ఆ వైబ్ తోనే ఎక్కడ విన్నా ఆ సాంగ్ వినిపిస్తుంది. కానీ అనగనగా ఒక రాజు సినిమాలో ఈ సాంగ్ మాత్రం అంత ఇంపాక్ట్ చూపించలేదు. సినిమా విషయంలో సాటిస్ఫై అయిన ఆడియన్స్ ఐటెం సాంగ్ ని మాత్రం ఎంజాయ్ చేయలేకపోయారు. ఇక సంక్రాంతి రేసులో వచ్చిన ఐదు సినిమాల్లో నవీన్ పొలిశెట్టి తన సత్తా చాటాడు. ఏదైతే ఆడియన్స్ తన మీద పెట్టుకున్న ఎక్స్ పెక్టేషన్స్ ని రీచ్ అయ్యే అవుట్ తో వచ్చి సక్సెస్ అందుకున్నాడు. ఈ సంక్రాంతికి వచ్చిన సినిమాల్లో అన్నీ కూడా ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయాలనే కాన్సెప్ట్ తోనే వచ్చాయి. అందుకే సినిమాలు కూడా మాక్సిమం మెప్పించాయి.

# అవసరమా పుష్ప?



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన పుష్ప 2 సినిమా ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమా ఎన్నో రికార్డ్‌లను సొంతం చేసుకుంది. ఇదే సమయంలో పుష్ప 2 సినిమాను జపాన్‌లో విడుదల చేస్తే తప్పకుండా వర్కౌట్ అవుతుందని, పైగా సినిమాలో జపాన్ ఎపిసోడ్ సైతం ఉండటం కలిసి వస్తుందని అంతా అనుకున్నారు. కానీ మొత్తం రివర్స్ అయింది. అంచనాలు తారుమారు అయ్యాయి. మేకర్స్ అనుకున్నట్లుగా కాకుండా మొత్తం తలకిందులు అయ్యాయి. జపాన్ లో పుష్ప 2 సినిమాను విడుదల చేసి చాలా పెద్ద తప్పు చేశారు అనే విధంగా అక్కడి నెంబర్స్ నమోదు అవుతున్నాయి.పుష్ప 2 సినిమాకు మొదటి రోజున కేవలం 886 టికెట్లు మాత్రమే అమ్ముడుపోయాయి అని స్థానిక మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. సాధారణంగా విదేశీ భాషల సినిమాలకు అక్కడ ఓపెనింగ్ తక్కువగానే ఉంటుంది. కానీ మరీ ఇంత తక్కువగా ఉండటంను మేకర్స్ జీర్ణించుకోలేక పోతున్నారు. గతంలో విడుదలైన ఆర్‌ఆర్‌ఆర్, కల్కి, సాహో సినిమాలు జపాన్‌లో భారీగా మొదటి రోజు టికెట్లు అమ్ముడు పోయాయి. కానీ ఇప్పుడు పుష్ప 2 సినిమాకు మరీ తక్కువ టికెట్లు అమ్ముడు పోవడంతో లాంగ్ రన్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకు జపాన్ లో విడుదలైన తెలుగు సినిమాల్లో ఏ ఒక్క సినిమా కూడా వెయ్యి లోపు మొదటి రోజు టికెట్లను నమోదు చేయలేదు. కేవలం పుష్ప 2 మాత్రమే వెయ్యి కంటే తక్కువ టికెట్ల నెంబర్ ను నమోదు చేయడం జరిగింది. పుష్ప 2 సినిమాను సరైన సమయంలో విడుదల చేయలేదని కొందరు అంటూ ఉంటే కొందరు మాత్రం సినిమాలో మ్యాటర్ లేదని తేల్చేస్తున్నారు.జపాన్ సినీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా పుష్ప 2 సినిమా లేదేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్న ఈ సమయంలోనే మరికొందరు మాత్రం సినిమా కచ్చితంగా లాంగ్ రన్‌లో నడువబోతుందని అంటున్నారు. వచ్చే వీకెండ్ వరకు జపాన్ లో పుష్ప 2 సినిమా గురించి ప్రముఖంగా చర్చ జరగడం, తద్వారా సినిమాకు మంచి వసూళ్లు నమోదు కావడం జరగబోతుంది అంటూ అల్లు అర్జున్ అభిమానులు ఇప్పటికీ నమ్మకంగా ఉన్నారు. సినిమాకు జపాన్ లో సరైన ప్రచారం లేక పోవడం వల్లే మొదటి రోజు ఓపెనింగ్ సరిగ్గా పడలేదని, సినిమాకు వచ్చే మౌత్ టాక్, సోషల్ మీడియా టాక్ కారణంగా తప్పకుండా బాక్సాఫీస్ వద్ద అతి పెద్ద సినిమాల్లో ఒకటిగా నిలుస్తుందనే విశ్వాసంను మేకర్స్ సైతం వ్యక్తం చేస్తున్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ సినిమాలో శ్రీలీల ఐటెం సాంగ్ చేయడం జరిగింది. దేవి శ్రీ ప్రసాద్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అలాంటి సినిమాను జపాన్ లో విడుదల చేసి పరువు పోగొట్టుకోవడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు అల్లు ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.


Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200